ఆర్‌టిసికి భారీ లక్ష్యం

- వచ్చే ఏడాది రూ.6,791 కోట్ల ఆదాయ ఆర్జన
- 75 శాతానికి ఒఆర్ పెంపు
- కొత్త నియామకాలపై కొరవడిన కార్యాచరణ

• లోపలి పేజీలో.. •

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 235 | విజయవాడ, బుధవారం 29 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 29 March 2023 | Rs

పాన్‌తో ఆధార్ లింక్ గడువు పొడిగింపు



న్యూఢిల్లీ : పాన్ కార్డ్‌తో ఆధార్ అనుసంధానం గడువును మరో మూడు మాసాలు పొడిగిస్తున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. రూ.1000 జరిమానాతో మార్చి 31 నాటికే ఈ గడువు ముగియనుంది. కానీ కొన్ని కోట్ల మంది ఇప్పటికీ వీటిని లింక్ చేసుకోనందున గడువు పెంచాలని భావించిందని తెలుస్తోంది. దీంతో పాన్, ఆధార్ అనుసంధానానికి జూన్ 31 వరకు అవకాశం కల్పించింది. అనుసంధానం చేసుకోకపోతే జూలై ఒకటో తేదీ నుంచి పాన్ కార్డ్ పని చేయదని ఆర్థిక శాఖ హెచ్చరించింది. ఇప్పటికే పలు సార్లు గడువు పొడిగించింది. పాన్, ఆధార్ లింక్‌కు రూ.1,000 రుసుం చాలా భారమని అనేక మంది ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 51 కోట్ల పాన్‌లు ఆధార్‌తో అనుసంధానం అయ్యాయని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సిబిడిటి) పేర్కొంది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

పులివెందులలో కాల్పుల కలకలం

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- లొంగిపోయిన నిందితుడు



మృతుడు దిలీప్ (ఫైల్)



గాయపడ్డ భాషా

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

వైఎస్ఆర్ జిల్లా, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడి సోదరుడు ఇద్దరు వ్యక్తులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌పి అన్బురాజన్ కథనం ప్రకారం... పులివెందుల పట్టణానికి చెందిన భరత్ కుమార్ యాదవ్‌కు అదే పట్టణంలోని గొర్రెల వ్యాపారి దిలీప్‌కుమార్ (24)కు మధ్య గత మూడేళ్లగా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. తనకు బాకీ ఉన్న 80 వేల రూపాయలు ఇవ్వాలని భరత్ కుమార్ యాదవ్‌ను దిలీప్‌కుమార్ గత వారం రోజులుగా అడుగుతున్నాడు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య పులివెందులలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మంగళవారం తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగింది. అక్కడి నుంచి హుటాహుటిన తన ఇంట్లోకి భరత్‌కుమార్ యాదవ్ వెళ్లి తుపాకీ తీసుకొచ్చి దిలీప్ కుమార్ ఛాతిపైనా, అడ్డుకోబోయిన దిలీప్‌కుమార్ స్నేహితుడు రాగిపాటి మహబూబ్ బాషా (అలియాస్ మస్తాన్)పైనా కాల్పులు జరిపాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. దిలీప్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందాడు. ఈ ఘటన అనంతరం భరత్ కుమార్ యాదవ్ తుపాకీతో సహా పులివెందుల పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. సంఘటనా స్థలాన్ని ఎస్‌పి అన్బురాజన్ పరిశీలించారు. సంఘటన జరిగిన తీరును, కారణాలను పులివెందుల డిఎస్‌పి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.

వివేకా కేసులో భరత్‌ను విచారించిన సిబిఐ

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో పలుమార్లు సిబిఐ అధికారులు భరత్ కుమార్ యాదవ్‌ను విచారించారు. ఈ నేపథ్యంలో ఆయన పలుమార్లు పత్రికా సమావేశం సమావేశాలు నిర్వహించి సిబిఐ అధికారులపైనా, వివేకా కుటుంబ సభ్యులపైనా ఆరోపణలు చేశాడు. తనకు ప్రాణహాని ఉందంటూ లైసెన్స్ గన్ పొందాడు. ఈ గన్‌తోనే కాల్పులు జరిపినట్లు సమాచారం. వివేకా కేసులో నిందితుడిగా ఉన్న సునీల్ కుమార్ యాదవ్‌కు భరత్ కుమార్ యాదవ్ సోదరుడు.

గ్రూప్-1 మెయిన్స్ వాయిదా

- జూన్ మొదటి వారంలో పరీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 23 నుంచి 29 వరకు జరగాల్సిన పరీక్షలను జూన్ మొదటి వారానికి వాయిదా వేస్తున్నట్లు ఎపిపిఎస్‌సి ప్రకటించింది. ఏప్రిల్ 24 నుంచి మే 18 వరకు సివిల్స్ ఇంటర్వ్యూలు ఉండటంతో ఈ పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ఎపిపిఎస్‌సి మెంబరు సలాంబాబు వెల్లడించారు. ఎపిపిఎస్‌సి గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలను జూన్ 3 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్లు ఎపిపిఎస్‌పి అధికారులు వెల్లడించారు. సోమవారం యుపిపిఎస్‌సి సివిల్స్ ఇంటర్వ్యూ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎపిపిఎస్‌సి తాజా నిర్ణయం తీసుకుంది. సివిల్స్ ఇంటర్వ్యూలకు రాష్ట్రం నుంచి పరీక్ష రాసే 25 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంది. వీరిని దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రూపు-1 మెయిన్స్ పరీక్షల తేదీల్లో మార్పులు చేశారు.



కదం తొక్కిన ఆశాలు

- అమలాపురం, కాకినాడ జిల్లాల్లో ధర్నాలు
- పిడిఎఫ్ మద్దతు

• లోపలి పేజీలో.. •

మీ సహకారం అవసరం

జి-20 సదస్సులో ముఖ్యమంత్రి జగన్

- రేపటి ఆర్థిక నగరాలపై సుదీర్ఘ చర్చ



జి-20 ప్రతినిధుల విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'మీ సహకారం అవసరం. మీ రాక మరిచిపోలేని జ్ఞాపకం. మీరు ఇక్కడ గడిపిన సమయం మీకు మధురానుభూతిని మిగులుస్తుందని భావిస్తున్నా. రాష్ట్రంలో ప్రజలందరికీ ఇంటి సౌకర్యం కల్పించాలన్నది మా ప్రభుత్వం ఉద్దేశం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈ నెల 31 వరకూ జరగనున్న జి-20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్-2 సమావేశాలు విశాఖ సాగర్‌నగర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి వివిధ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారితో భేటీ అయిన జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, 22 లక్షల ఇళ్లు కడుతున్నామని, ఆ ఇళ్లకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించడానికి తమ ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపడుతోందని అన్నారు. దీనిపై సరైన చర్చలు జరిపి సస్టెయిన్‌బుల్ పద్ధతులను సూచించాలని జి-20 దేశాల ప్రతినిధులను కోరారు. సరైన మార్గనిర్దేశకత్వం వల్ల మంచి ఇళ్లు పేదలకు సమకూరుతాయన్నారు. తొలుత గన్నవరం నుంచి విశాఖకు విమానంలో చేరుకున్న సిఎం జగన్‌కు పలువురు మంత్రులు, ఎంపిలు, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్న ఆయన సిఎం జి-20 ప్రతినిధులతో కలిసి గాలా డిన్నర్‌లో పాల్గొన్నారు. కాగా, సిఎం విశాఖ బయలుదేరే ముందు గన్నవరం ఎయిర్‌పోర్టులో ఆయన ప్రయాణించాల్సిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. వెంటనే స్పందించిన నిపుణులు సరిచేయడంతో సిఎం విశాఖ చేరుకున్నారు.

పట్టణాల్లో మౌలిక వసతు కల్పనపై చర్చ

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సలోమన్ అలోక్‌రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో రేపటి ఆర్థిక నగరాల నమూనా ఎలా ఉండాలి?' అనే అంశంపై డిబేట్ జరిగింది. జి-20 దేశాల్లో 14 దేశాలకు చెందిన 57 మంది, అతిథి దేశాలకు చెందిన 8 మంది ప్రతినిధులు తొలి రోజు చర్చలో పాల్గొన్నారు. పది ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్లు ఈ చర్చలో భాగస్వామమయ్యాయి. జి-20 దేశాల్లో పట్టణాలు, నగరాల్లో ఆర్థికపరమైన ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై ఒక డ్రాఫ్టు ముసాయిదాను సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యులు చర్చించారు. బుధవారం దీనిపై నిర్ణయాలు చేసే అవకాశాలున్నాయి. సుస్థిర ఆర్థిక ప్రగతి దిశగా మౌలిక వసతులను పట్టణాల్లో కల్పించడం ద్వారా భవిష్యత్తు తరాలకు కావాల్సిన సదుపాయాలను అందించే దిశగా కార్యాచరణ ఉంటుందని నిర్వాహకులు అలోక్‌రాజ్ ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ప్రపంచంలో అమల్లో ఉన్న ఫైనాన్షియల్ మోడల్స్, థీమ్స్ అన్నిటినీ వేర్వేరు అజెండాలుగా తొలిరోజు చర్చలు సాగాయి. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రయివేట్ రంగం పెట్టుబడులు పెట్టే విధంగా నిపుణుల అభిప్రాయాలు తెలియజేశారు. ఆర్థిక అగాథాల వల్ల భవిష్యత్తు నగరాల భావన దెబ్బతినకుండా 'క్వాలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇండికేటర్స్' పలు ప్రాజెక్టులకు సంబంధించి ఎలా ఉండాలో వివరించారు. పలు అంతర్జాతీయ సంస్థలు ఈ రౌండ్ టేబుల్ చర్చలో పాల్గొన్నాయి. నగరాలు, పట్టణాల్లో పన్నుల విధానంపై 13 మంది అంతర్జాతీయ నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. యుఎన్‌డిపి, ఒఇసిడి, ఐఎంఎఫ్, ఎడిబి, ఐబిఆర్‌డి వంటి అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయి. తమ దేశాల్లో ప్రాజెక్టులు, మౌలిక వసతుల రంగాల అభివృద్ధి నమూనాలపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టాటస్టిక్స్, జియోగ్రఫీ (ఐఎన్ఇజి), మెక్సికోకు చెందిన నేషనల్ స్టాటస్టిక్స్ సంస్థ, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)కు చెందిన పలు సంస్థలు తమ కేస్ స్టడీస్ పేపర్లను రౌండ్ టేబుల్ సెషన్‌లో వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్ వారసత్వ సాంస్కృతిక సంపదపై ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు దేశీయ ప్రతినిధులు వివరించారు. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రత్యేక కళలు, సాంస్కృతిక వైభవాన్ని తెలియజేస్తూ ప్రతినిధులకు రాడిసన్ బ్లూ హోటల్ వెనుక భాగంలోగల 'బీచ్ ఫ్రంట్'లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విశాఖపట్నం సాంస్కృతిక ప్రాధాన్యతలను వివరించారు.

ఎర్ర కోటకు ప్రతిపక్షాల మార్చ్

- అడ్డుకున్న పోలీసులు
- పలువురి అరెస్టు



ర్యాలీని అడ్డుకోవడంతో పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాల నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ, అదానీ కుంభకోణంపై జెపిసి వేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య పరిరక్షణ శాంతి కాగడా ప్రదర్శన నిర్వహించాయి. మంగళవారం నాడిక్కడ ఎర్ర కోట నుంచి పాత ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో టౌన్ హాల్ వరకు ప్రతిపక్ష నేతలు కాగడాలతో మార్చ్ నిర్వహించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందంటూ మార్చ్‌కు ఢిల్లీ పోలీసులు అనుమతిని నిరాకరించారు. సిఆర్‌పిసి సెక్షన్ 144 కింద ఆంక్షలు విధించారు. వేదిక వద్దకు వెళ్లకుండా ప్రతిపక్ష నేతలను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. కొంతమందిని బలవంతంగా వాహనాల్లో ఎక్కించి, వివిధ వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ సహా పలువురు ఎంపిలను అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, నియంతలకు భయపడబోమంటూ నాయకులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. నిరసనలో టిఎంసి తదితర పార్టీల ఎంపిలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

రాహుల్‌గాంధీపై అనర్హత వేటువేయడం, నిరసన తెలిపిన పార్టీ కార్యకర్తలను నిర్బంధించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కాంగ్రెస్ ఎంపి జైరామ్ రమేష్ అన్నారు. పార్లమెంటు లోపల, బయట తమ గొంతు నొక్కేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. కనీసం నిరసన తెలపనివ్వకపోవడం ఏవిధమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీని బెదిరించడం, భయపెట్టడం, అవమానించడం వంటి చర్యలకు కేంద్రప్రభుత్వం పాల్పడుతోందని ఎఐసిసి అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.


నేడు ఢిల్లీకి సిఎం జగన్ !

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఈ నెల 17న ఢిల్లీలో ప్రధాని మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సిఎం భేటీ అయ్యారు. పది రోజుల వ్యవధిలోనే రెండో దఫా ఢిల్లీకి వెళ్లనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నెల 27న గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో తాజా రాజకీయ పరిణామాలతోపాటు పలు అంశాల గురించి సుమారు గంటా 25 నిమిషాలు చర్చించారు. గవర్నరుతో భేటీలో సిఎంకు ఆయన ఏం సూచించి ఉంటారనే చర్చ నడుస్తోంది. ఢిల్లీ పర్యటన గురించి మంగళవారం రాత్రి 10 గంటల వరకు అధికారికంగా టూర్ షెడ్యూల్ విడుదల కాలేదు. విశ్వసనీయ సమాచారం మేరకు కడప మాజీ ఎంపి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిఎం సోదరుడు కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి తనను సిబిఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో మంగళవారం అఫిడవిట్ దాఖలు చేశారు. సిబిఐ మరో దఫా అవినాష్‌రెడ్డిని విచారణకు పిలిచి అరెస్టు చేసే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన కోర్టును ఆశ్రయించి ఉంటాడనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే కేసును త్వరితగతిన తేల్చాలని సుప్రీంకోర్టు సిబిఐని ఆదేశించింది. ఈ నేపథ్యంలో జగన్ పర్యటనపై ఆసక్తి నెలకొంది.

మార్గదర్శి కేసులో రామోజీకి నోటీసు

- కోడలు శైలజకు కూడా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్ అవకతవకల కేసులో ఆ సంస్థ ఛైర్మన్ చెరుకూరి రామోజీరావుకు, ఆయన కోడలు మేనేజింగ్ డైరెక్టరు చెరుకూరి శైలజకు సిఐడి నోటీసులు జారీ చేసింది. మార్గదర్శిలో నిధుల మళ్లింపు, అక్రమంగా డిపాజిట్ల సేకరణ చేశారని ఎపి ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్ట్ కింద రామోజీరావు, శైలజపై 420, 409, 120-బి, 477-ఎ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసులో సిఐడి విచారణకు అందుబాటులో ఉండాలని సిఐడి డిఎస్‌పి రవికుమార్ నోటీసులు జారీ చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు సహకరించాలని సిఐడి నోటీసుల్లో పేర్కొంది. మార్చి 29, 31, ఏప్రిల్ 3, 6 ఆ తేదీల్లో ఏదో ఒక తేదీన మీ నివాసంలో గానీ, మంగళగిరిలోని సిఐడి కార్యాలయంలో గానీ విచారణకు అందుబాటులో ఉండాలని, దర్యాప్తునకు సహకరించాలని సిఐడి కోరింది. మార్చి 12న రాష్ట్ర వ్యాప్తంగా మార్గదర్శి చిట్ ఫండ్ బ్రాంచిలపై సిఐడి దాడులు నిర్వహించి నల్గురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. 14న మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు పి రాజాజి తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేస్తూ, మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థకు చెందిన ఏ ఒక్క అధికారిపైనా, మరీ ముఖ్యంగా హైదరా బాద్‌లో ఉంటున్న రామోజీరావు, ఆయన కోడలు శైలజపై ఎలాంటి నిర్బంధ చర్యలు తీసుకోకుండా ఆంధ్రప్రదేశ్ సిఐడిని ఆదేశించాలని అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్‌లో దాఖలైన ఎఫ్ఐఆర్ చెల్లుబాటు గురించి జస్టిస్ విజయసేన్ రెడ్డి పిటిషనర్ తరపు న్యాయవాదిని అడిగారు. ఇదిలా వుండగా పిటిషనర్లు ఆర్థిక అవకతవకలకు పాల్పడింది ఆంధ్రప్రదేశ్‌లోనని, అయితే వారు నివసిస్తున్నది తెలంగాణాలోనని, అంతమాత్రాన తెలంగాణలో సిఐడి సోదాలు నిర్వహించరాదనడం సరికాదని ఎపి ప్రభుత్వ తరపు ప్రత్యేక న్యాయవాది కోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు రామోజీరావు, శైలజలపై ఎటువంటి నిర్బంధపు చర్యలు చేపట్టరాదని సిఐడిని ఆదేశించారు. అక్రమాలు చోటు చేసుకున్నట్లు చిట్స్ రిజిస్ట్రార్ నుంచి ఫిర్యాదు వచ్చిన తరువాతే విశాఖ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట, అనంతపురంలలోని మార్గదర్శి బ్రాంచిలపై సిఐడి దర్యాప్తు చేపట్టిందని సిఐడి తెలిపింది.

రాజధాని అమరావతి కేసులో

స్టేకు సుప్రీం నిరాకరణ

- ఎపి ప్రభుత్వ న్యాయవాదులపై జస్టిస్ ఆగ్రహం
- తదుపరి విచారణ జులై 11కి వాయిదా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేసులో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. త్వరితగతిన విచారించాలని కోరిన ఎపి ప్రభుత్వ న్యాయవాదులపై జడ్జి జోసెఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి విచారణను జులై 11వ తేదీకి వాయిదా వేశారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఏపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను, అమరావతి రైతులు దాఖలు చేసిన పిటిషన్లను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇతర కేసుల విచారణ సందర్భంగా కోర్టు సమయం ముగుస్తుండటంతో ఈరోజే విచారించాలని ఏపి ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు కెకె వేణుగోపాల్, నిరంజన్‌రెడ్డి పిటిషన్ ధర్మాసనాన్ని కోరారు. మూడు రాజధానుల చట్టాలను ఉపసంహరించుకున్న తరువాత ఏపి హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అర్థం లేదని వాదనలు వినిపించారు. 'రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్న చట్టాలపై హైకోర్టు తీర్పు ఇచ్చిందని, అలాగని పూర్తిస్థాయి స్టే ఎక్కడా లేదనీ బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. పైగా ఈ అంశం కోర్టు పరిధి కాదని, పూర్తిగా అకడమిక్ (థియరీటికల్ ఆసక్తి ఉంటుంది కానీ ప్రాక్టికల్ రిలవెన్స్ ఉండదు)అని తెలిపారు. వాదనలకు గంట సమయం చాలనీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతులు కట్టేశారని, అభివృద్ధి ముందుకు వెళ్లడం లేదని, త్వరగా విచారణ పూర్తి చేసి ఈ అంశాన్ని తేల్చాలని ప్రభుత్వం తరుపు న్యాయవాదులు

మిగతా 2లో

'రైతుబంధు' అడ్రస్ గల్లంతు!

- ఆపదలో అన్నదాతను ఆదుకోవాల్సిన పథకం ఎత్తివేత
- ఎంసిల గోదాములు ప్రైవేటుకు లీజు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఆపద కాలంలో రైతులను ఆదుకోవాల్సిన 'రైతుబంధు' పథకం అడ్రస్ గల్లంతైంది. మార్కెట్‌లో ధరలు పతనమైన విపత్కర సందర్భాల్లో పంటలను నిల్వ పెట్టుకొని తనఖా రుణాలిచ్చే స్కీం 'రైతుబంధు'. వ్యవసాయ మార్కెటింగ్ డిపార్టుమెంట్ క్షేత్ర స్థాయిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి)ల ద్వారా పథకాన్ని ఎప్పటినుంచో అమలు చేస్తోంది. నాలుగేళ్ల నుంచి ఈ స్కీం నిలిచిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా రైతుల పంటలపై ఎఎంసిలు తనఖా రుణాలిచ్చిన దాఖలాల్లేవు. కోవిడ్ వలన రెండేళ్లపాటు మార్కెట్ సదుపాయాల్లేక రైతులు పంటలను వచ్చినకాడికి తెగనమ్ముకొని నష్టపోయారు. కోవిడ్ అనంతరం సైతం రాష్ట్రంలో ఏ పంటకూ ఏ ప్రాంతంలోనూ సరైన రేటు లేదు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సైతం దక్కట్లేదు. ఎంఎస్‌పి లేని ఉత్పత్తులది మరీ దయనీయం. ఈ పరిస్థితుల్లో రైతుబంధు ఉంటే కొంత మంది రైతులకైనా కాస్తంతైనా ఉపశమనం దొరికేది. ఎఎంసిలలో పథకం ఎత్తేయడంతో ఆ మాత్రం ఆసరా సైతం అందక అన్నదాతలు ఆర్థికంగా కుదేలవుతున్నారు.



దశాబ్దాలనాటి సదుపాయం

రైతుల పంటలను తనఖా పెట్టుకొని రుణం ఇచ్చే పథకం దశాబ్దాల నుంచి ఉంది. 1980లో ప్రవేశపెట్టారు. 1995లో 'రైతుబంధు' అన్న పేరు పెట్టారు. రైతులు పంటలను మార్కెట్ యార్డులకు తీసికెళ్లినప్పుడు ధర రానిపక్షంలో అక్కడి గోదాముల్లో దాచుకోవచ్చు. అలా దాచుకున్న పంటను తనఖాగా పెట్టుకొని, పంట విలువలో ఎఎంసిలు 75 శాతం రుణం ఇస్తాయి. ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.2 లక్షలు ఇస్తారు. 180 రోజులపాటు రైతు వడ్డీ చెల్లించాల్సినపని లేదు. 'అసలు' చెల్లిస్తే సరిపోతుంది. ఆపైన కూడా గోదాముల్లో దాచుకుంటే నామమాత్రపు రుసుం చెల్లించాలి. ధర లేని సమయాల్లో వ్యాపారులకు పంటలను తెగనమ్ముకోకుండా, ధర వచ్చినప్పుడు అమ్ముకునే వెసులుబాటు రైతులకు లభిస్తుంది. మరోవైపు రైతుల చేతి ఖర్చులకు పైకం అందుతుంది. ఈ స్కీం రానురాను నిర్వీర్యమైపోయింది. విభజన తర్వాత 2014-2019 మధ్య ఏటా గరిష్టంగా 5,500 మంది రైతులు లబ్ధి పొందారు. రూ.40 కోట్ల వరకు రుణాలిచ్చారు. వైసిపి సర్కారొచ్చాక 2019-20 నుంచి పథకం మొత్తానికే పడకేసింది.

ఖాళీగా గిడ్డంగులు

ఎపిలోని 218 ఎఎంసిల పరిధిలో 1,069 స్వంత గోదాములున్నాయి. వాటి కెపాసిటీ 9.93 లక్షల టన్నులు. ప్రభుత్వం నిజంగా అన్నదాతలకు ధర ఇప్పించాలనుకుంటే పంటలను ఎఎంసిల గోదాముల్లో నిల్వ చేసి అప్పులివ్వొచ్చు. అకాల వర్షాలు, వరదలతో రైతులకు పంటలను దాచుకునే అవకాశం లేక నీటిపాలవుతున్నాయి. ప్రభుత్వమేమో ఉన్న రైతుబంధు పథకాన్ని ఎత్తేసింది. ఎఎంసిల గోదాములను ప్రైవేటు వ్యాపారులకు సరుకులు నిల్వ చేసుకోడానికి అద్దెకిస్తున్నారు. కొన్ని చోట్ల గృహనిర్మాణశాఖ సిమెంట్, ఇనుము, ఇతర సామగ్రిని స్టోర్ చేస్తోంది. వ్యవసాయశాఖ ఎరువులు, విత్తనాల నిల్వకు వాడుకుంటోంది. మరికొన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్లు స్టోరేజి కోసం ఎఎంసి గోదాములను వినియోగిస్తున్నాయి. కొన్ని గోదాములు ఆలనాపాలనా లేక నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి.



మౌనిక, భవ్య, గౌతమి

కోనేట్లో ఈతకు వెళ్లి... ముగ్గురు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)

కోనేట్లో ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాలభైరవస్వామి కొండ వద్ద నిర్వహిస్తున్న గంగమ్మ జాతరకు దేవదొడ్డి గ్రామానికి చెందిన కదిరప్ప కుటుంబం బంధుమిత్రులతో వెళ్లారు. కదిరప్ప కుమార్తె గౌతమి (13), బంధువులైన తమిళనాడు రాష్ట్రం ఆరట్ల గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమార్తె భవ్య (17), వెంకటరమణ కుమార్తె మౌనిక (13) కోనేట్లో ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొట్టే ప్రయత్నంలో వారు కొలనులో మునిగిపోతుండగా అక్కడ ఉన్నవారు గుర్తించి బయటకు తీశారు. బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే ముగ్గురు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్టిసికి భారీ లక్ష్యం

- వచ్చే ఏడాది రూ.6,791 కోట్ల ఆదాయం ఆర్జన
- 75 శాతానికి ఒఆర్ పెంపు
- కొత్త నియామకాలపై కొరవడిన కార్యాచరణ



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఆర్టిసిని ప్రజా రవాణా శాఖగా మార్చిన తరువాత ఆ సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం చాలా వరకు తగ్గాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పెరుగుతున్న డీజిల్ ధరలకు అనుగుణంగా ప్రయాణికుల నుంచి టికెట్ల రూపంలో భారీగా వసూలు చేస్తోన్న ప్రభుత్వం క్రమంగా ఆర్టిసిని 'సేవా' రంగం నుంచి 'వ్యాపారం' వైపు అడుగులు వేయిస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో గత డిసెంబరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా 129 డిపోల నుంచి 11,285 బస్సులను 110.84 కోట్ల కిలోమీటర్లు నడిపి 68 శాతం ఒఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) సాధించింది. తద్వారా రూ.4168.23 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఆర్టిసికి భారీ లక్ష్యాలను నిర్దేశించింది. 153 కోట్ల కిలోమీటర్లతో 75 శాతం ఒఆర్తో పనిచేసి రూ.6,742 కోట్ల ఆదాయాన్ని సాధించాలని ప్రభుత్వం రూపొందించిన వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ లక్ష్యాల సాధనకు కొత్త బస్సులు కొనుగోలు, గ్యారేజీ సామర్థ్యం పెంపు, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాల్సిన ప్రభుత్వం ఈ అంశాలను విస్మరించింది. వ్యాపార సంస్థల తరహాలో భారీ లక్ష్యాలను కార్మికుల ముందుంచింది. ప్రస్తుతం వరకు 11,149 బస్సులు నడుపుతుండగా వీటిలో 8,743 బస్సులు ఆర్టిసికి చెందినవి కాగా, 2,406 బస్సులను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. 2023-24 సంవత్సరంలో పాత బస్సులను మరమ్మతులు చేసి రీ మోడల్ చేయాలని, మరికొన్ని అద్దె బస్సులను తీసుకోవాలని నిర్ణయించారు. అద్దె బస్సులను 21 శాతం నుంచి 32 శాతానికి పెంచడం ద్వారా సంస్థకు మరో రూ.90 కోట్ల వరకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదా అవుతుందని అంచనా వేశారు. 2021-22లో రూ.3448.90 కోట్ల ఆదాయం రాగా, రూ.2022-23 పూర్తయ్యే సరికి రూ.5582.66 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఈ ఆదాయం మరో 20 శాతం పెంచుకుని 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,791.90 కోట్ల ఆదాయం రాబట్టాలని లక్ష్యం నిర్దేశించారు. ఈ లక్ష్యాల సాధనకు 3,354 బస్సులు అవసరమని ఆర్టిసి అంచనా వేసింది. 3,354 బస్సుల కొనుగోలుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఇందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో వెన్నెల ఒకటి, డాల్ఫిన్ క్రూయిజ్ 37, ఇంద్ర 14, మెట్రో లగ్జరీ 24, సూపర్ లగ్జరీ 775, అల్ట్రా డీలక్స్ 281, ఎక్స్‌ప్రెస్ 804, సప్తగిరి 309, మెట్రో ఎక్స్‌ప్రెస్ 148, పల్లెవెలుగు 757, సిటీ ఆర్డినరీ 204 బస్సులు ఉన్నాయి. గతేడాది తిరుపతిలో వంద ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసినా ఈ ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదని సమాచారం.

నియామకాలు లేకుండా ఎలా సాధ్యం

ఆర్టిసిలో కొత్త నియామకాలు జరగడం లేదు. డ్రైవర్లు ఉద్యోగ విరమణ చేసినా తిరిగి కాంట్రాక్టు పద్ధతిలో వారినే కొనసాగిస్తున్నారు. కండక్టర్ల నియామకం లేకుండా అద్దె బస్సు డ్రైవర్లకు సైతం టిమ్‌లు ఇస్తున్నారు. ఒక్కో సందర్భంలో ఆర్టిసితో సంబంధం లేని ఇతర వాహనాల డ్రైవర్లను సైతం ఆర్టిసి బస్సులను నడిపేందుకు తాత్కాలిక ప్రాతిపదికన తీసుకొస్తున్నారు.

నియామక ప్రక్రియ వెంటనే చేపట్టాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

సిబ్బంది నియామక ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య డిమాండ్ చేశారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు. కార్మికులకు వైద్య సదుపాయాలు సరిగా అందడం లేదని తెలిపారు. గతంలో కార్పొరేషన్‌లో ఉన్నప్పుడు కార్మికులకు అందిన వైద్య సదుపాయాలను యథాతథంగా అమలు చేయాలని కోరారు.

ప్రస్తుతం వస్తున్న టికెట్ల ఆదాయంలో ప్రభుత్వం ప్రతి నెల రూ.125 కోట్ల వరకు తన ఖజానాలో జమ చేసుకుంటోందన్నారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని కోరారు.

గవర్నరును కలిసిన సమాచార కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర సమాచార కమిషనర్ ఆర్ మహబూబ్ బాషాతోపాటు సభ్యులు గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను మంగళవారం రాజ్‌భవన్‌లో కలిశారు. గవర్నరును కలిసిన వారిలో కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు కట్టా జనార్దన్‌రావు, ఐలాపురం రాజా, ఆర్ శ్రీనివాసరావు, యు హరి ప్రసాద్‌రెడ్డి, కె చెన్నారెడ్డి, పి శ్యాముల్ జోనాథన్‌తోపాటు సెక్రటరీ(ఇ/చ) జి శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా కమిషన్ పనితీరు, రాష్ట్రంలో ఆర్టిఐ చట్టం అమలుపై సంక్షిప్త నివేదికను గవర్నరుకు సమర్పించారు.

ఆర్థికశాఖ అధికారులు ఢిల్లీ బాట

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో చివరిగా రావాల్సిన నిధుల కోసం రాష్ట్ర అధికారులు ఢిల్లీ బాట పడుతున్నారు. సోమవారం ఇదే అంశంపై ఢిల్లీకి వెళ్లిన ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ అక్కడి కేంద్ర ఆర్థికశాఖ అధికారులతో చర్చించారు. తమకు రావాల్సిన నిధులను 31లోగా విడుదల చేయాలని అభ్యర్థించారు. ఆర్థిక సంవత్సరాంతానికి రాష్ట్రానికి దాదాపు 15 వేల కోట్లకుపైగానే పలు పథకాలకు, వాటా నిధులు రావాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. తాజా అంచనాల మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు వచ్చే అవకాశం ఉందని, వాటిల్లోనూ కోతలు తప్పవని అక్కడి అధికారులు చెప్పినట్లు తెలిసింది.

ప్రశ్నిస్తే కేసులా?

- ఎపి ప్రొఫెషనల్ ఫోరమ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే ఆయనపై పరువునష్టం కేసులా? అని ఎపి ప్రొఫెషనల్ ఫోరమ్ నాయకులు నేతి మహేశ్వరరావు ప్రశ్నించారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిబిఐ, ఇడి వంటి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అత్యున్నత సంస్థల నుంచి అదానీ గ్రూప్‌కు ఏమైనా కేంద్ర ప్రభుత్వం మినహాయింపునిచ్చిందా? అని ప్రశ్నించారు. అదానీపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతుంటే ప్రభుత్వరంగ బ్యాంకులు అప్పులు ఇవ్వడానికి ఎందుకంత ఉబలాట పడుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ప్రొఫెషనల్ ఫోరం సెక్రటరీ బొప్పన రాజశేఖర్‌రావు, నవక్రాంతి పార్టీ అధ్యక్షులు కనకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

దళితులకు మూడెకరాల భూమి పంచాలి

- డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి (పల్నాడు జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం నవరత్నాలను పెట్టిందని, అన్నిటికంటే మనిషి ఆత్మగౌరవంగా బతికేందుకు మరో దశమరత్నాన్ని పెట్టాలని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు అన్నారు. ఈ దశమరత్నం ద్వారా దళితులకు మూడు ఎకరాల భూమి పంచాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా అమరావతిలో జరుగుతున్న కెవిపిఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం అమలు అనే అంశంపై సెమినార్ జరిగింది. కెవిపిఎస్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో వి శ్రీనివాసరావు మాట్లాడారు. దేశంలో ఎస్‌సి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్, ఎస్‌టి సబ్‌ప్లాన్‌లు 1998లో ప్రణాళిక సంఘం ద్వారా ఏర్పాటు చేసినా అవి చట్టంగా చేయలేదని తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో అప్పటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు, కెవిపిఎస్ నాయకత్వంలో ఆమరణ నిరాహార దీక్ష చేయడంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేశారని తెలిపారు. నోడల్ ఏజెన్సీ కూడా న్యాయానికి సరితూగదని భావించి నిర్వహించిన విశాల ఐక్య ఉద్యమ ఫలితంగా 2013లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం వచ్చిందన్నారు. పది సంవత్సరాలకే అమలు చేయడం.. ఫిబ్రవరి 23తో ఆ గడువు ముగియనుండడం.. కెవిపిఎస్ పోరాటం చేయడంతో మళ్లీ మరో పది సంవత్సరాలకు పొడిగిస్తూ ప్రకటించారన్నారు. సబ్ ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా, సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఆనంద్ బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పి.వసంత్, తిరుపాల్, అత్తలూరు సర్పంచ్ బంకా సరోజిని పాల్గొన్నారు.

మంత్రి విడదల రజినికి నోటీసులు

- గనుల తవ్వకాలపై స్టేటస్‌కో

ప్రజాశక్తి-అమరావతి

పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, మురికిపూడి గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల్లో గ్రానైట్ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన కేసులో రాష్ట్ర మంత్రి విడదల రజినితోపాటు ఇతరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వీరశివ గ్రానైట్స్ ఎమ్‌డి వీరప్రతాప్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులశాఖ ముఖ్య కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శికి కూడా నోటీసులిచ్చింది. తదుపరి విచారణ జరిగే వరకు గ్రానైట్ తవ్వకాలను నిలుపుదల చేయాలంటూ స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఏప్రిల్ 10కి వాయిదా వేసింది.

మరో కేసులో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు నోటీసులు

నందిగామ నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను సవాల్ చేసిన కేసులో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గనులశాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టరు ఇతరులకు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

త్రిసభ్య ధర్మాసనానికి ఆర్-5 జోన్ కేసు

రాజధాని ఏరియా మొత్తం విస్తీర్ణంలో ఐదు శాతం భూమిని పేదల ఇళ్లకు కేటాయించాలని సిఆర్‌డిఎ నిబంధన నిర్దేశిస్తోందని, అందులో భాగంగా ఆర్-5 జోన్ ఏర్పాటు జరిగిందని అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు తెలియజేశారు. ఆర్-5 జోన్ ఏర్పాటు గెజిట్ నోటిఫికేషన్‌ను కృష్ణాయపాలెం రైతు అవల నందకిషోర్ పిటిషన్‌పై జస్టిస్ బి కృష్ణమోహన్ విచారణ జరిపారు. ఇదే తరహా పిటిషన్లను సిజె నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారిస్తోందని ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో ఈ పిటిషన్‌ను కూడా అదే బెంచ్‌కు నివేదించాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి - తణుకు రూరల్(పశ్చిమగోదావరి)

గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం ముద్దాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... పాఠశాల ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం తలను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వేరు చేశారు. తొలగించిన తల భాగాన్ని పక్కనే ఉన్న చెరువులో పడేశారు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తణుకు టౌన్, రూరల్ సిఐలు సత్యనారాయణ, ఆంజనేయులు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం గురించి తెలియడంతో గ్రామస్తులు, దళిత సంఘాల నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు.

అంకుర ఆలోచనలతో నైపుణ్య సమాజం

- సమగ్ర శిక్ష ఎస్‌పిడి సురేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యార్థి దశ నుంచే సృజనాత్మకతను జోడించి అంకుర ఆలోచనలతో నైపుణ్య సమాజం నిర్మించాలని సమగ్ర శిక్ష డైరెక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఎస్‌సిఇఆర్ సంయుక్త ఆధ్వర్యాన విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అంకుర సాధికార అభివృద్ధి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 57 ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక ఆలోచనలు పారిశ్రామిక అభివృద్ధికి దోహదం చేస్తాయని వివరించారు. పాఠశాల స్థాయి నుండే పిల్లల్లో విజ్ఞాన నైపుణ్యాలను పెంపొందించాలని అన్నారు. విద్య సమాజ మార్పునకు ఉపకరించే అత్యంత విలువైన ఆయుధం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఇఆర్‌డి డైరెక్టర్ ప్రతాపరెడ్డి, ఇఎండిపి ప్రోగ్రాం ప్రధాన బాధ్యులు నెగ్రిన్ మిధ్లాజ్ పాల్గొన్నారు.

అమలాపురం కేసులు ఉపసంహారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమలాపురంలో జరిగిన అల్లర్లలో ఇరువర్గాలపై నమోదైన కేసులను ఉపసంహరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇరువర్గాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. తరతరాలు కలిసి ఉన్న ప్రజల మధ్య భావోద్వేగాలతో ఘర్షణలు చోటుచేసుకోవడం దురదృష్టకరమైన చర్య అని అన్నారు. జరిగిన ఘటనను మరిచిపోయి అంతా కలిసిమెలిసి వుండాలని, అందుకు ప్రభుత్వం వైపు నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. కోనసీమ ప్రాంతంలో మళ్లీ గొడవలు జరగకుండా ప్రతిఒక్కరూ సామరస్యంగా వుండేందుకే ప్రభుత్వం కేసులను ఉపసంహరిస్తోందని తెలిపారు.

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జీడిపిక్కల రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం, ఎపి గిరిజన సంఘం, జీడిరైతుల సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం ఎపి గిరిజన కార్పొరేషన్ ఎమ్‌డి జి సురేష్‌కుమార్‌కు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, నాయకులు కె మోహన్‌రావు, జీడి రైతుల సంఘం నాయకులు టి అజయ్‌కుమార్, ఎపి గిరిజన సంఘం అధ్యక్షులు ఎస్ అప్పారావు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో దాదాపు 1,83,000 హెక్టార్లలో జీడి మామిడిని పండిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిఏటా లక్ష మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. జీడిపిక్కల రంగంలో దాదాపు రెండు లక్షల మంది ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. జీడిపిక్కలను పండించిన రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. జీడిపిక్కలకు 80 కిలోల బస్తాకు రూ.16,000 (కిలోకు రూ.200) గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద మూడేళ్లకు ఎకరాకు రూ.94 వేలను జీడిరైతులకు అందించాలని కోరారు.

ఆర్‌టిసి బస్సులో మహిళ ప్రసవం

- బిడ్డ మృతి.. తల్లి క్షేమం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న గర్భిణీ బస్సులోనే ప్రసవించింది. ఈ ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం ఐనముక్కలలో మంగళవారం చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా నన్నూరు గ్రామానికి చెందిన ఈబూది సాలమ్మ కాన్పు నిమిత్తం ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని తన పుట్టింటికి వచ్చింది. ఆమె భర్త శ్రీను భార్యను చూసేందుకు సోమవారం త్రిపురాంతకం వచ్చాడు. రాత్రి భార్యభర్తల మధ్య వివాదం జరగడంతో శ్రీను వెళ్లిపోయాడు. దీంతో మంగళవారం తెల్లారుజామున సాలమ్మ కూడా కర్నూలు వెళ్లేందుకు విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఎక్కింది. బస్సు పెద్దదోర్నాల మండలం ఐనముక్కల గ్రామ సమీపానికి వచ్చేసరికి ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. బస్సులో ఉన్న తోటి మహిళా ప్రయాణికులు బస్సులోనే ఆమెకు కాన్పు చేశారు. అనంతరం ఆటోలో పెద్ద దోర్నాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బిడ్డ మృతి చెందగా, తల్లి క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

జడ్జిగా హేమలత ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఆర్ హేమలత ఇటీవల తెలంగాణ హైకోర్టు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో రాణించి జడ్జిగా ఎంపికవడం పట్ల సుప్రీం కోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్‌కుమార్, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సంపర శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. హేమలత న్యాయ విద్యను దామోదరం సంజీవయ్య లా కళాశాలలో చదివారు. ఈ మేరకు జడ్జిగా చిన్న వయసులోనే ఎన్నికైన హేమలతకు అభినందనలు తెలుపుతూ వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాజధాని అమరావతి కేసులో స్టేకు సుప్రీం నిరాకరణ

(మొదటిపేజీ తరువాయి)

పట్టుబట్టారు. అదే సమయంలో పిటీషన్ దాఖలు చేసిన వారిలో కొంతమంది రైతులు చనిపోయారని, వారి తరుపున ప్రతినిధులు ప్రతివాదులుగా ఉండేందుకు అవకాశం ఇవ్వాలని రైతుల తరుపు న్యాయవాది ఉన్నం మురళీధర్‌రావు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి అనుమతించిన కోర్టు వెంటనే మరణించిన వారి తరుపు ప్రతినిధులకు నోటీసులు పంపాలని ఆదేశించింది.


ప్రభుత్వ న్యాయవాదులపై కోర్టు ఆగ్రహం

వాస్తవంగా అమరావతి కేసు 10వ నెంబరుతో విచారణకు రావాల్సి ఉంది. అయితే 8వ నెంబర్ కేసు విచారణ జరుగుతుండగా ప్రభుత్వ తరపు న్యాయవాదులు శేఖర్ నప్డే, నిరంజన్ రెడ్డి అమరావతి కేసును విచారించాలని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీనిపై జస్టిస్ జోసెఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక కేసు సగం విచారణలో ఉండగా మరో కేసు ఎలా విచారించాలని న్యాయవాదులను ప్రశ్నించారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ఒక కేసు విచారణ పూర్తి కాకుండా మరో కేసు విచారించడం తగదని, ఇప్పటికిప్పుడు విచారణ సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. ఈ దశలో ఏపి ప్రభుత్వం తరపు న్యాయవాదులు ఏప్రిల్ 11న విచారణ జాబితాలో చేర్చాలని కోరారు. అయితే తాను జూన్ 16న పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో వేగవంతంగా విచారణ జరిపి తీర్పు రాయడానికి సమయం లేదని జస్టిస్ జోసఫ్ వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను జూలై 11కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

హిందూజాకు అదనపు చెల్లింపులపై క్లెయిమ్ వస్తేనే నిర్ణయం : ఎపిఇఆర్‌సి

ఎం వేణుగోపాలరావు

విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) అమలులోకి రాకముందు కాలానికి విశాఖపట్నంలోని హిందూజా నేషనల్ పవర్ కార్పొరేషన్ (హెచ్ఎన్‌పిసిఎల్)కు చెందిన 1040 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు అదనంగా స్థిర ఛార్జీలు చెల్లింపు వ్యవహారంపై ఏదైనా వివాదం ఉంటే, ఆ ఒప్పందంలో భాగస్వాములలో ఎవరైనా దానిని కమిషన్ ముందు లేవనెత్తవచ్చునని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎపిఇఆర్‌సి) పేర్కొంది. హెచ్ఎన్‌పిసిఎల్‌కు, డిస్కాంలకు మధ్య కుదిరిన పిపిఎకు, చెల్లించాల్సిన ఛార్జీలకు అనుమతిస్తూ, గతేడాది ఆగస్టు మొదటి తేదీన తామిచ్చిన ఉత్తర్వుకు విరుద్ధంగా ఏమైనా చెల్లింపులు చేస్తే, ఇంధన, విద్యుత్ కొనుగోలు వ్యయం సర్దుబాటు (ఎపిపిపిసిఎ) కింద ఆ చెల్లింపులను అనుమతించబోమని కమిషన్ 2023-24 సంవత్సరానికి ఇచ్చిన విద్యుత్ ఛార్జీల ఉత్తర్వులో స్పష్టం చేసింది. 2020 ఆగస్టు 21 నుంచి 2022 ఫిబ్రవరి 2వ తేదీ వరకు గల కాలంలో సరఫరా చేసిన, చేయని విద్యుత్‌కు రూ.1200 కోట్ల మేరకు హిందూజాకు అక్రమంగా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నదని, అలా చెల్లించరాదని డిస్కాంలను ఆదేశించాలని వార్షిక ఆదాయ అవసరాలపై బహిరంగా విచారణ సందర్భంగా కమిషన్ను కోరాము. దానిపై కమిషన్ పైవిధంగా ప్రతిస్పందించింది. ఈ కేసులో అసాధారణ పరిస్థితులు, వాస్తవాల దృష్ట్యా హిందూజా ప్రాజెక్టు మొదటి యూనిట్ వాణిజ్యపరంగా పనిచేయటం ప్రారంభించిన తేదీ (సిఒడి) నుంచి 2022 జులై 31 వరకు ఎప్పటికప్పుడు నిర్ణయించిన ఛార్జీలే తుది ఛార్జీలు అవుతాయని గత ఆగస్టులో ఇచ్చిన ఉత్తర్వులో కమిషన్ స్పష్టం చేసింది. ఆ కాలంలో కమిషన్ ఉత్తర్వుల ప్రకారం హిందూజా సరఫరా చేసిన విద్యుత్‌కు డిస్కాంలు కమిషన్ నిర్ణయించిన ఛార్జీలను చెల్లించాయి. ఎపిఇఆర్‌సిలో రెండేళ్లకుపైగా జరిగిన విచారణలో, వార్షిక ఎఆర్ఆర్‌పై జరిగిన విచారణలో, అప్పిలేట్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టులో జరిగిన విచారణలో హిందూజాపై కాలానికి సరఫరా చేసిన, చేయని విద్యుత్‌కు డిస్కాంలు అదనపు చెల్లింపులు చేయాలన్న ప్రస్తావన కూడా చేయలేదు. ఉత్తర్వుల్లోని ఈ అంశంతో సహా పలు అంశాలను ప్రశ్నిస్తూ, హిందూజా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ కమిషన్లో పెండింగులో ఉంది. దానిపై ప్రతివాదులైన డిస్కాంలు తమ వైఖరిని కమిషన్ దాఖలు చేయకుండా గడువును పొందుతూ వస్తున్నాయి. ప్రభుత్వ వైఖరి దృష్ట్యా డిస్కాంలు తమ కౌంటర్ దాఖలు చేయకుండా వాయిదాలు కోరుతూ వస్తున్నాయి. కౌంటర్ దాఖలు చేసేందుకు ఏప్రిల్ 12వరకు కమిషన్ గడువు ఇచ్చింది.



ఇదిలా ఉండగా, కమిషన్‌పై ఉత్తర్వు ఇవ్వటానికి ముందు తాను సరఫరా చేసిన, చేయని విద్యుత్ భారీగా అదనపు చెల్లింపులు చేయాలని హిందూజా కంపెనీ డిస్కాంలను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తర్జనభర్జనలు చేసి, హిందూజాకు రూ.1234.68 కోట్ల మొత్తాన్ని అదనంగా చెల్లించేందుకు అనుమతించింది. ఈ మొత్తాలను చెల్లించేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్) లేదా గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆసి) నుండి రుణం పొందేందుకు దరఖాస్తు చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 16న జారీ చేసిన 19వ నెంబరు జిఓలో ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ రుణానికి ప్రభుత్వ గ్యారంటీ పొందటానికి అనుమతిచ్చింది. న్యాయపరమైన అంశాలు, వివిధ మార్గాలను పరిగణనలోకి తీసుకుని, ఈ మొత్తం వ్యవహారాన్ని జాగ్రత్తగా పరిశీలించాక ఈ మేరకు ఆదేశాలిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. పిఎఫ్‌సి నుండి నాలుగు విడతలుగా ఈ రుణాన్ని పొంది, హిందూజాకు చెల్లించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎపిఇఆర్‌సి ముందుకు వెళ్లాలని ఆర్థికశాఖ కార్యదర్శి అభిప్రాయం, లేదా రూ.400 కోట్లు చెల్లించటం, లేదా రూ.1234 కోట్లు చెల్లించటం, లేదా హిందూజా క్లెయిమును తిరస్కరించటం ప్రభుత్వ పరిశీలనకు వచ్చిన ప్రతిపాదనలు. ఈ వ్యవహారంలో అడ్వకేట్ జనరల్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి అభిప్రాయాలను ప్రభుత్వం పొందింది. ఈ న్యాయనిపుణుల అభిప్రాయాలు ఏవైనా, చట్టపరంగా అవి కమిషన్ ఉత్తర్వును అధిగమించలేవు. ప్రభుత్వ నిర్ణయం ఎపిఇఆర్‌సి ఉత్తర్వును ఉల్లంఘించటం, చట్టవిరుద్ధం అవుతుంది. ఎఆర్ఆర్‌పై కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణ సందర్భంగా డిస్కాంలు వివరాలేమీ తెలపకుండా, ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని దాటవేత సమాధానం ఇచ్చాయి. ఈ వ్యవహారంలో ఎవరి స్వార్థ ప్రయోజనాలేమిటనేది ఎవరైనా ఊహించుకోవచ్చు. విద్యుత్ చట్టం, 2003 ప్రకారం రాష్ట్రంలోని ప్రాజెక్టుల నుండి డిస్కాంలు కొనుగోలు చేసే విద్యుత్‌కు ఛార్జీలను నిర్ణయించటం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ పరిధిలోనిది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ జోక్యానికి తావు లేదు. ఈ అంశంపై హిందూజా రివ్యూ పిటిషన్ కమిషన్లో పెండింగులో ఉండగా, దానిపై డిస్కాంలు తమ వైఖరేమిటో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయకుండా, ప్రభుత్వం ఇలా నిర్ణయం తీసుకున్న తీరు అనుచితం. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే తమ వైఖరిని డిస్కాంలు కమిషన్‌కు తమ కౌంటర్లో తెలుపుతాయనేది స్పష్టం. ఈ పరిస్థితిలో, హిందూజా, డిస్కాంల మధ్య వివాదం తలెత్తి, కమిషన్లో కొత్తగా పిటిషన్ దాఖలు చేసే పరిస్థితికి తావులేదు. ఇంత భారీ మొత్తాల చెల్లింపు ఇమిడివున్న హిందూజా రివ్యూ పిటిషన్‌పై కమిషన్ బహిరంగ విచారణ కూడా జరపటం లేదు.

కమిషన్ హిందూజా పిపిఎకి అనుమతిస్తూ, ఛార్జీలను నిర్ణయిస్తూ ఉత్తర్వును జారీ చేసిన తేదీ నుండి పిపిఎలోని అంశాలు అమలులోకి వస్తాయి. తాము వివరించిన కారణాల వల్ల, పిపిఎ అమలులోకి రాకపూర్వం హిందూజా సరఫరా చేసిన (చేయని) విద్యుత్‌కు గతం నుండి అమలులోకి వచ్చే విధంగా ఈ ఉత్తర్వులో నిర్ణయించిన ఛార్జీలను వర్తింపజేస్తే, డిస్కాంలు భారీగా ట్రూఅప్ క్లెయిములు చేయాల్సి వస్తుందని, ఆ భారం అంతిమంగా వినియోదారులపై పడుతుందని, ప్రజా ప్రయోజనానికి ఇది పెద్ద నష్టం కలిగిస్తుందని కమిషన్ తన ఉత్తర్వుల్లో వివరించింది. హిందూజాకు ఇంత భారీగా ప్రజాధనాన్ని అదనంగా సమర్పించే ప్రభుత్వ నిర్ణయం కమిషన్ ఉత్తర్వుకు పూర్తిగా విరుద్ధం. తమ ఉత్తర్వుకు విరుద్ధంగా డిస్కాంలు చెల్లింపులు చేస్తే, వాటికి సంబంధించి అవి చేసే ఎపిపిపిసిఎ క్లెయిములను తిరస్కరిస్తామని ఛార్జీల ఉత్తర్వులో కమిషన్ పేర్కొనటంలో రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. హిందూజాకు పై విధంగా అదనపు చెల్లింపులు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం దృష్ట్యా, ఆ మేరకు హిందూజా రివ్యూ పిటిషన్ను తాము వ్యతిరేకిం చటం లేదని డిస్కాములు కమిషన్‌కు నివేదించే అవకాశాన్ని తోసిపుచ్చలేము. ఈ రివ్యూ పిటిషన్‌పై విచారణ ప్రక్రియ ఎప్పటికి పూర్తయి, కమిషన్ ఉత్తర్వు వస్తుందో, ఉతర్వు ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. రివ్యూ పిటిషన్ కమిషన్ ఇచ్చే ఉత్తర్వును బట్టి పై మొత్తాల చెల్లింపుకు సంబంధించి డిస్కాములు చేసే ఎపిపిపిసిఎ క్లెయిములపై కమిషన్ నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆధారపడి ఉంటుంది. రికార్డయిన వాస్తవ అంశాలలో ఏదైనా తేడా వుంటే తప్ప రివ్యూ పిటిషన్లపై ఇచ్చే ఉత్తర్వుల్లో సాధారణంగా మార్పులు జరగవు.

రివ్యూ పిటిషన్‌పై కమిషన్ నియంత్రణ ప్రక్రియ జాప్యమైతే, ఈలోగా ప్రభుత్వ నిర్ణయం ప్రకారం హిందూజాకు డిస్కాంలు చెల్లింపులు చేస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది మరో అంశం. వచ్చే నెల నుంచి అలా చెల్లింపులు ప్రారంభమైతే, ఆ మొత్తాలను ఎపిపిపిసిఎ నిబంధనల కింద యూనిట్‌కు నెలకు 50 పైసల చొప్పున కమిషన్ ముందస్తు అనుమతి లేకుండా డిస్కాంలు వినియోగదారుల నుండి వసూలు చేసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత ఎపిపిపిసిఎ క్లెయిములను పరిశీలించి ఉత్తర్వులిచ్చే విధంగా కమిషన్ ఈ నిబంధనలను సవరించేందుకు ప్రకటించిన ప్రతిపాదనలు అమలు లోకి వస్తే, 2023-24కు సంబంధించిన ఎపిపిపిసిఎ క్లెయిములు 202425లో కమిషన్ పరిశీలనకు, ఉత్తర్వు కోసం వస్తాయి. 2023-24 సంవత్సరానికి కమిషన్ లెక్కగట్టిన మూడు డిస్కాంల విద్యుత్ విక్రయాలు 67890.21 మి.యూ.లలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ 10202.44 మి.యూ. తగ్గిస్తే, మిగిలిన 57687.77 మి.యూ.లపై యూనిట్ 50 పైసల చొప్పున డిస్కాంలు కమిషన్ ముందస్తు అనుమతి లేకుండా రూ.2884.38 కోట్లు ఎపిపిపిసిఎ కింద వసూలు చేసుకోవచ్చు. అంటే, హిందూజాకు ప్రభుత్వ అనుమతి మేరకు చెల్లించిన అదనపు మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరంలో డిస్కాంలు వినియోగదారుల నుండి వసూలు చేస్తాయి. ఏడాది తరువాత ఆ మొత్తాలకు డిస్కాంల ఎపిపిపిసిఎ క్లెయిములను తన ఉత్తర్వుకు విరుద్ధమని కమిషన్ తిరస్కరించినా, హిందూజా నుండి ఆ మొత్తాలను తిరిగి రాబట్టటం వివాదాలకు దారితీస్తుంది.

సమస్యలపై కదం తొక్కిన ఆశాలు

- అమలాపురం, కాకినాడ జిల్లాల్లో ధర్నాలు
- మద్దతు తెలిపిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐవి

ప్రజాశక్తి- అమలాపురం, కాకినాడ

సమస్యలపై ఆశావర్కర్లు కదం తొక్కారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం కలెక్టరేట్ వద్ద, కాకినాడలోని డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించారు. కనీస వేతనాలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, వేధింపులను అరికట్టాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, నాణ్యమైన సెల్ఫోన్లు ఇవ్వాలని నినదించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు. అమలాపురం కలెక్టర్ వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ధర్నాలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అనేకేళ్లుగా పేదలకు వైద్యసేవలందిస్తున్న ఆశాల శ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయన్నారు. రూ. పది వేల వేతనంతో వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఆశ వర్కర్లకు జాబ్చార్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆశాలతో కలిసి వినతిపత్రం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాకినాడలో తొలుత సుందరయ్య భవన్ నుంచి ఆశాలు ర్యాలీగా వచ్చి డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి బేబిరాణి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్కుమార్ మాట్లాడారు. ఆశాలపై అధికారుల ఒత్తిళ్లు మానుకోవాలన్నారు. వారిపై దాడులను అరికట్టాలని, అదనపు పనులను అప్పగించరాదని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఎంహెచ్ఒ రమేష్కి వినతిపత్రం అందించారు. ఆశాలకు జాబ్చార్ట్ విడుదల చేస్తామని, అధికారుల వేధింపులు ఉంటే తక్షణమే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, ఐద్వా నాయకులు, సిఐటియు నాయకులు మద్దతుగా పాల్గొన్నారు.


కాకినాడ డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశాలు

పిఎఫ్‌పై 5 పైసల వడ్డీ పెంపు

2022-23కు 8.15%గా నిర్ణయం



న్యూఢిల్లీ : ఉద్యోగ, కార్మికుల పిఎఫ్‌పై కేవలం 5 పైసలు వడ్డీ పెంచారు. ఎంప్లాయిస్ ప్రావిడెండ్ ఫండ్ డిపాజిట్లపై ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23కు గాను 8.15 శాతం వడ్డీ చెల్లించడానికి మంగళవారం జరిగిన ఇపిఎఫ్ఒ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖకు ట్రస్టీ ప్రతిపాదనలు పంపించనుంది. ఇంతక్రితం 2021-22లో 8.10 శాతం వడ్డీని అందించారు. గత నాలుగు దశాబ్దాల్లో పిఎఫ్‌పై ఇదే తక్కువ వడ్డీ రేటు కావటం గమనార్హం. దీంతో పోల్చితే అతి స్వల్పంగా 0.05 శాతం లేదా 5 పైసల పెంపుదల చోటు చేసుకుంది. కేంద్రం నుంచి ఆమోదం లభించిన తర్వాత ఇపిఎఫ్ఒ వడ్డీ రేటును అధికారికంగా గెజిట్‌ను విడుదల చేయనుంది. ఆ తర్వాత వడ్డీని ఖాతాదారుల ఖాతాల్లో జమ చేయనుంది. మోడీ సర్కార్ అధికారంలోకి రాక ముందు 2013-14లో పిఎఫ్‌పై గరిష్టంగా 8.75 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. క్రమంగా దీన్ని తగ్గిస్తూ వచ్చింది. ఇపిఎఫ్ఒలో 5 కోట్ల పైగా ఖాతాదారులు ఉన్నారు.

గిరిజన ఎమ్మెల్యేల వైఖరి ఏంటి?

- బోయ/వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చడంపై.. గిరిజన సంఘం నిలదీత
- 31న మన్యం బంద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల గిరిజన ఎమ్మెల్యేలు తమ వైఖరిని స్పష్టం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. విశాఖలోని ఎంవిపి కాలనీలో గల గిరిజన్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ ఈ నెల 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని తెలిపారు.

గిరిజన సలహా మండలి (టిఎసి)లో తీర్మానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేస్తామని చెప్పడం ఐదో షెడ్యూల్డ్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని గిరిజనులు, గిరిజన ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఏకసభ్య కమిషన్‌కు విజ్ఞాపన పత్రాలు సమర్పించినా, తమ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా జగన్మోహన్‌రెడ్డి ముందుకు వెళ్లారన్నారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు సిఫార్సు చేసే విధంగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్యామూల్ ఆనందకుమార్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌పై ఒత్తిడి తీసుకువచ్చారని విమర్శించారు. శ్యామూల్ ఆనందకుమార్ సమర్పించిన నివేదికపై అసెంబ్లీలోగానీ, టిఎసిలోగానీ చర్చించకుండా రాజ్యాంగ వ్యవస్థను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 31న మన్యం బంద్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మన్యం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



మన్యం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు

ఎల్‌బిజి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు

ఎల్‌బి. గంగాధర్‌రావు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను విస్తృతంగా నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో ఎల్‌బిజి 20వ వర్ధంతిని కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమ దశ నుంచి ఎల్‌బిజి వచ్చారన్నారు. ఆయన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగానూ, పొలిట్‌బ్యూరో సభ్యులుగా పనిచేస్తూ ప్రజా ఉద్యమాలు నిర్మించారని తెలిపారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆ సమయంలోనే నల్లమల అడవులలో రహస్య జీవితాన్ని గడుపుతూ పార్టీ ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేశారని తెలిపారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై బలమైన ఉద్యమాన్ని నిర్మించారన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకృతి వనరులను, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని తెలిపారు. లౌకికతత్వ పునాదులను మోడీ నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఆ పునాదులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందుకోసం ప్రజలను సమీకరించి విస్తృతంగా పోరాటాలు నిర్వహించడమే ఎల్‌బిజికి మనమిచ్చే ఘనమైన నివాళులని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, వై.సిద్ధయ్య, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, ఎం రమేష్, డి.సోమయ్య వెల్లంపల్లి ఆంజనేయులు, ఊసా వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎల్‌బిజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేని దుస్థితి

- వైసిపి పాలనపై నారా లోకేష్ ఆగ్రహం

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్ (శ్రీ సత్యసాయి జిల్లా)

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పది రూపాయలు ఇచ్చినట్టు బటన్లు నొక్కుతూ పన్నుల రూపంలో వంద రూపాయలు లాక్కుంటున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం 53వ రోజుకు చేరుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని గుమ్మయగారిపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర కొత్తపల్లి, మల్లాపల్లి, పాలసముద్రం, నల్లగొండ్రాయనిపల్లి వరకు సాగింది. మల్లాపల్లిలో ఇటుకల తయారీ కార్మికులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఇటుకల తయారీని కుటీర పర్శిమగా గుర్తించి షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇటుకల తయారీకి అవసరమైన మట్టి తోలుకోడానికి, కట్టెలు కొట్టుకోడానికి ఉచితంగా అనుమతులు ఇస్తామన్నారు. పాలసముద్రం క్రాస్ వద్ద బిసిలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిసిలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయంగా సీట్లు కేటాయించి చట్టసభల్లో అవకాశం కలిపిస్తామన్నారు. చంద్రన్న బీమాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఇవ్వండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను నేరుగా విద్యార్థులకు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పన్నుల భారాలతో జనం సతమతం అవుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలను మరచి పాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. 'మరో 24 గంటలు పెనుగొండ నియోజకవర్గంలోనే ఉంటాను, దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలంటూ' ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు లోకేష్ సవాల్ విసిరారు. లోకేష్ పాదయాత్ర సాయంత్రానికి నల్లగొండ్రాయనిపల్లికి చేరుకుంది. రాత్రికి లోకేష్ అక్కడే బస చేశారు. పాదయాత్రలో మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బిసి సదస్సులో ప్రసంగిస్తున్న నారా లోకేష్

ఉండవల్లి శ్రీదేవి పలికేది చంద్రబాబు స్క్రిప్టునే

- మంత్రి మేరుగ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు రచించిన స్క్రిప్టు ప్రకారం ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా ఉంటున్నారని తెలిపారు. ఉండవల్లి శ్రీదేవి టిడిపి లైన్‌లో నడుస్తూ వైసిపిపై బురదజల్లే కార్యక్రమం తీసుకున్నారని విమర్శించారు. తప్పులు చేసి దళిత మహిళను అనడం సరైందికాదన్నారు. నియోజకవర్గం ప్రజలకు ఎమ్మెల్యేగా ఏం చేశారో చెప్పాలన్నారు.

భార్యను హత్య చేసి.. భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

భార్యను హత్య చేసి..ఆపై భర్త కూడా సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఒంగోలులోని విరాట్‌నగర్ కాలనీలో అంజిరెడ్డి (43), పూర్ణిమ (39) దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వీరిరువురూ హైదరాబాద్‌లో చదువు కుంటున్నారు. ఆటో నడుపుతూ అంజిరెడ్డి కుటుంబాన్ని పోషిస్తున్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం రాత్రి దంపతుల మధ్య చోటు చేసుకున్న గొడవలో చపాతి కర్రతో పూర్ణిమ తలపై అంజిరెడ్డి బలంగా కొట్టాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అంజిరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పూర్ణిమను అంజిరెడ్డి తండ్రి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కొత్తపట్నం సముద్రంలో దూకి...

ఒంగోలు నుంచి అంజిరెడ్డి కొత్తపట్నం చేరుకుని సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఆయన మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రజాస్వామ్యంపై బిజెపి దాడిని ఒక్కరైనా ఖండించారా?

- రాష్ట్ర ఎంపీలను నిలదీసిన కెవిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటులో ప్రజాస్వామ్యాన్ని బిజెపి హత్య చేస్తే రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపిలు స్పందించకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ మాజీ సభ్యులు కెవిపి రామచంద్రరావు తప్పుబట్టారు. రాహుల్ గాంధీకి అండగా నిలబడేందుకు వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కలిసిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌కు అండగా అన్ని పార్టీలూ ఏకతాటిపైకి వస్తున్నాయని, ఈ ఉద్యమం జాతీయ ఉద్యమంగా మారుతోందన్నారు. రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ జరిగే పోరాటానికి టిడిపి అధినేత చంద్రబాబు ఢిల్లీ కేంద్రంగా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. బిజెపికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేసే వారికి వైసిపి ప్రభుత్వం అణచివేయకుండా ఉండాలని సూచించారు. అధికార పార్టీకి 30 మంది ఎంపిలున్నా ప్రత్యేక పరిస్థితుల్లో సైలెంట్ అయ్యారని, ప్రశ్నించడానికే పుట్టిన జనసేన పార్టీ బిజెపికి మిత్రపక్షంగా ఉన్నప్పటికీ అంతర్గతంగానైనా రాహుల్ విషయంలో ప్రశ్నించాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబాన్ని మోడీ ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. అదానీ గురించి రాహుల్ ప్రశ్నిస్తే ఈ రకంగా ఇబ్బంది పెట్టడమేంటని రామచంద్రరావు ప్రశ్నించారు. మోడీలంటేనే బిసిలేనా? పార్శీలు, ముస్లిములు, జైన్, మార్వాడిల్లో ఇలా సామాజిక వర్గాల్లో మోడీలు ఉన్నారన్నారు. దక్షిణాది భారతీయులు, బెంగాలీ మనోభావాలను దెబ్బతీశారని మోడీపై కేసు పెడితే అనర్హులుగా ప్రకటించేస్తారా? అని ప్రశ్నించారు. రాహుల్‌ను పార్లమెంటులో మాట్లాడకుండా చేసేందుకు బిజెపి అనర్హత వేటు పేరుతో రాజకీయ డ్రామాకు తెరలేపిందన్నారు. మీడియా సమావేశంలో పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.



యువ మోర్చా నేతలదే కీలక పాత్ర

- సోము వీర్రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజకీయాలు బిజెపి చుట్టూ తిరుగుతున్నాయని, యువ మోర్చా నేతలే కీలకపాత్ర పోషించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు సురేంద్రమోహన్ అధ్యక్షతన బిజెవైఎం రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరెడ్డి శబరి, మిట్టా వంశీ పాల్గొన్నారు. అనంతరం పార్టీ 175 నియోజకవర్గాలకు అసెంబ్లీ కన్వీనర్లను ప్రకటించారు.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	రామ్ ఇండియా ఎంటర్‌ప్రైసెస్ మరియు నున్న రాంబాబు/డో.నం. 263/5 ఆరుంబాక గ్రామ డో.నం.1/241 గుళ్లపల్లి, ఆంధ్రప్రదేశ్ గుంటూరు-522309/ 238605000979	ఆస్తి 1 : ఆంధ్రప్రదేశ్ గుంటూరు-522309 గళ్లపల్లి ఆరుంబాక గ్రామం డో.నం.263/5 లో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ తో బేరింగ్ డో.నం.1-232 విస్తీర్ణం 290.4 చ.గ.లు. లేదా 242.80 చ.మీ.లు. పాత డో.నం.1-241, మూల్యాంకనం నం.242, తూర్పు: 12 అడుగుల ఉమ్మడి రోడ్డు, దక్షిణం: బాపట్ల-వెల్లటూరు హైవే రోడ్డు, పడమర: కొండూరు వెంకట రామారావు యొక్క సైట్, ఉత్తరం: కొండూరు వెంకట రామారావు యొక్క సైట్. తో కలిసి అన్నీ భవనములు మరియు నిర్మాణాలు అందులో ఫిక్చర్స్, ఫిట్టింగ్స్ మరియు అన్నీ ప్లాంట్ మరియు యంత్రాలు భూమికి జోడించబడి ఉంటాయి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిషత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి. లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 23 మార్చి, 2023	22-11-2022 Rs. 1,02,78,352.04/-	గుంటూరు మరియు ప్రకాశం

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.
తేది : 29 మార్చి, 2023
ప్రదేశం : గుంటూరు మరియు ప్రకాశం
ఆధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola Enter a better life
కార్పొరేట్ ఆఫీసు: 1వ అంతస్తు, 'దరె హౌస్', నం.2, ఎన్.ఎస్.సి.బోస్ రోడ్, చెన్నై-600001.

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్")
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ది సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క అధీకృత అధికారిగా క్రింది సంతకందారు, చట్టం క్రింద మరియు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులు జారీచేసి రూల్ 3తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరినారు. డిమాండ్ నోటీసుల బట్వాడాను నివారించుటకు రుణగ్రహీతలుకు క్రింది సంతకందారు డిమాండ్ నోటీసును గోడకు అతికించారు మరియు రూల్స్ ప్రకారం ప్రచురిస్తున్నారు. డిమాండ్ నోటీసుల్లో ఉన్న సమాచారం ఇందు దిగువ ఇవ్వబడుచున్నది:

క్ర. సం.	రుణగ్రహీత & సహా-రుణగ్రహీతల పేరు & చిరునామా	రుణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది & బకాయి మొత్తాలు	ఆస్తి/ సెక్యూర్డ్ అసెట్ వివరణ
1	**Loan A/c. No(s). :** X0HLVJI00001796725 **1.చేగు గంగారాం కుమార్, 2. చేగు రాణి. ఇరువురి నివాసం:** డోర్ నం. 16-18-33, 1వ క్రాస్‌బూరెల వారి స్ట్రీట్, గుంటూరు-522 001, ఆం.ప్ర. **మరియు:** డోర్ నం. 19-16-7, ఫ్లాట్ నం.5-జె, ఆనంద నిలయం, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, పొన్నూరు రోడ్డు, సంగడిగుంట, గుంటూరు-522 001, ఆం.ప్ర.	₹ 22,52,175/-	22.03.2023 & **21.03.2023** నాటికి రూ. **29,58,351/-** (రూపాయలు ఇరువై తొమ్మిది లక్షల యాభై ఎనిమిది వేల మూడు వందల యాభై ఒకటి మాత్రమే)	గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, సంగారిగుంట, మున్సిపల్ వార్డు నం.14, సబ్‌క్వెంట్ వార్డునం.15, బ్లాక్ నం.8, అర్బన్ ల్యాండ్ సీలింగ్ పర్మిషన్ రీ సర్వే టి.ఎస్.నం.533/2/1 ద్వారా డోర్ నం.19-16-7 దగ్గరలో గల దానిపై అన్ని ఈసిమెంటరీ హక్కులతోపాటు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో ఉమ్మడి ఏరియాతో కలిపి 1000చ.అ.ల ప్లింత్ ఏరియాతో ఆనంద నిలయం యొక్క నాల్గవ అంతస్తులో 1వ బ్లాక్ లో ఫ్లాట్ నం.5-జె గల దానిపై ఫ్లాట్‌తోపాటు 4133.44చ.గ.లు (3456-09చ.మీ.)ల పూర్తి విస్తీర్ణంలో విడదీయలేని 41-3/4 చ.గ.లు (34.56చ.మీ.) విస్తీర్ణం మొత్తం మరియు **సరిహద్దులు: సైటుకు సరిహద్దులు: తూర్పు:** ఇంద్రప్రియదర్శిని కాలనీ మెయిన్ రోడ్డు- 122-6అ.లు; **దక్షిణం:** మోదుగుల గోపాల కృష్ణా రెడ్డి మొ॥వారి ఆస్తి- 34.0అ.లు; **తిరిగి తూర్పు:** మోదుగుల గోపాల కృష్ణా రెడ్డి మొ॥వారి ఆస్తి-57.91అ.లు, **తిరిగి దక్షిణం:** గుడ్ విల్ అసోసియేట్స్ ఆస్తి-201.7అ.లు, **పడమర:** బాలత్రిపుర సుందరి రైస్ మిల్ ఆస్తి-180.7అ.లు; **ఉత్తరం:** ఈ ఆస్తికి ప్రహారీగోడ-187.0అ.లు; **ఫ్లాట్‌కు సరిహద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** గ్రౌండ్‌లో లిఫ్టు, ఓపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి కారిడార్; **ఉత్తరం:** గ్రౌండ్ లో ఓపెన్ టు స్కై.
2	**Loan A/c. No(s). :** X0HLVJI00001717638 **1. షేక్ బాజి, 2. షేక్ కరీముల్లా, 3. షేక్ ఖాసిం బీ,** అందరి నివాసం: 20-14, వెటర్నరీ హాస్పిటల్, రోడ్ ఇబ్రహీంపట్నం, విజయవాడ-521456, ఆం.ప్ర. **మరియు:** 20-50, శ్రీసాయి బాలాజీ టవర్స్, ఫ్లాట్ నం.201, మొదటి అంతస్తు, ఇబ్రహీంపట్నం, జిమ్ దగ్గర, కృష్ణా-521 456, ఆం.ప్ర.	₹ 24,89,957/-	22.03.2023 & **21.03.2023** నాటికి రూ. **32,91,875/-** (రూపాయలు ముప్పై రెండు లక్షల తొంభై ఒక వేల ఎనిమిది వందల డెబ్బై ఐదు మాత్రమే)	కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్-రిజిస్ట్రీ, ఇబ్రహీంపట్నం మండలం, ఇబ్రహీంపట్నం గ్రామపంచాయతి ఏరియా, ఇబ్రహీంపట్నం వద్దగల ఆర్.ఎస్.నం.91/1, సబ్-డివిజన్ ఆర్.ఎస్.నం.91/1బి లో 850.66చ.గ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను 41.07చ.గ.ల ఉమ్మడి విడదీయలేని భాగంతోపాటు 851.43చ.అ.ల నిర్మాణ ఏరియాతో **"శ్రీసాయి బాలాజీ టవర్స్"** (పంచాయత్ అసెస్మెంట్ నం.5733) యొక్క మొదటి అంతస్తులోని ఫ్లాట్ నం.201 ఆస్తి. **సరిహద్దులు: ల్యాండ్‌కు సరిహద్దులు: తూర్పు:** వి. రంగారెడ్డి, పి.నర్సింహా రావు& వై. ప్రసాద్ & ఇతరుల ఆస్తి, **దక్షిణం:** ఎన్. సాంబశివ రావుఆస్తి; **పడమర:** పంచాయతి బజార్; **ఉత్తరం:** షేక్ శంషద్ బేగం& ఇతరుల ఆస్తి; **ఫ్లాట్‌కు సరిహద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై; **దక్షిణం:** ఓపెన్ టు స్కై; **పడమర:** ఉమ్మడి కారిడార్; **ఉత్తరం:** ఓపెను టు స్కై- పై సరిహద్దుల్లో 851.43చ.అ. పూర్తి ప్లింతు ఏరియా, కారిడారు మొ॥నవి ఉమ్మడి ఏరియా-90.28, పార్కింగు ఏరియా 80చ.అ.లు మరియు అన్ని ఈసిమెంటు హక్కులు.

రుణగ్రహీతలను అనేకసార్లు డిమాండ్ నోటీసులు పంపి కోరినప్పటికీ బకాయి మొత్తాలను చెల్లించనందున, కోరునది ఏమనగా, ఈ ప్రచురణ తేదీ నుండి **60 రోజుల్లోగా** ఇందు పై పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తాలను వర్తించబడు వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ చార్జీలు, ఖర్చులు మరియు చెల్లించు రియలైజేషన్ తేదీ వరకు దానిపై వ్యయాలతో తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. రుణగ్రహీతలు గమనించాల్సింది ఏమనగా, రుణగ్రహీతలచే వారి సెక్యూర్డ్ అసెట్స్‌గా స్థిరాస్తి/ ఆస్తులపై సెక్యూర్డ్ డెట్స్‌కు సెక్యూర్డ్ క్రెడిటర్ నుండి రుణగ్రహీతలచే రుణ సదుపాయం పొందియున్నారని దయచేసి గమనించగలరు. సెక్యూర్డ్ క్రెడిటర్ సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొనుటకు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అన్ని హక్కులను కలిగియున్నారు దానితోపాటు చట్టం క్రింద అందుబాటులోగల ఇతర అంశాల దృష్ట్యా అమ్మకం రూపేనా రుణగ్రహీతలు బదిలీచేయలేరు. సెక్యూర్డ్ క్రెడిటర్ అమ్మకం మరియు ట్రాన్స్‌ఫర్ హక్కులతో దానిని స్వాధీనంకు ముందు **అటాచ్ మరియు/లేదా సీలు**కు కూడా అధికారాలు కలిగియున్నారు. సెక్యూర్డ్ క్రెడిటర్‌కు చెల్లించాల్సిన బకాయిలు కవరుచేయుటకు అమ్మకం ద్వారా తగినన్ని మొత్తాలు రాని పిమ్మట
మిగతా బకాయిలను రాబట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ విడిగా లీగల్ ప్రొసీడింగ్ అమలుచేయ ఆస్కారం ఉంటుంది, మరియు ఏదేని ఇతర చట్టం క్రింద సెక్యూర్డ్ క్రెడిటర్‌కు అందుబాటులోగల అన్ని ఇతర రెమెడీస్ యొక్క అదనపు మరియు స్వతంత్రంగా రెమెడీ కలిగియుంటారు.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13(8)కు రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది మరియు తదుపరి చట్టం యొక్క సెక్షన్ 13(13)తో రుణగ్రహీతలు సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేనిదే, ఆస్తులను అమ్మకం, లీజు, లేదా బదిలీచేయుట నుండి నిషేదింపబడినారు. మరియు ఎవరైనా సదరు నియమాలను ఉల్లంఘించినచో, సదరు చట్టం యొక్క సెక్షన్ 29 క్రింద శిక్ష పడుటకు బాధ్యులగుదురు. డిమాండ్ నోటీసు కాపీ క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటుంది మరియు అవసరమైతే, రుణగ్రహీతలు దానిని ఏదేని పనిదినమున పనివేళల్లో క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును.
ప్రదేశం: గుంటూరు/ విజయవాడ, ఆం.ప్ర.
తేది: 22.03.2023
మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున అధీకృత అధికారి

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Bank | శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/భౌతిక స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది /డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	సతీష్ దండు/ శ్రావణి దండు/ LBGTR00005120821	(లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కవర్‌చేయబడిన పరిధిలో ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ 1000 చ.అ.లు., ప్లాట్ నం.11 12 13, డో.నం.18/ఏ, 18/బి, 19, ఫ్లాట్ నం.-509, 4వ అంతస్తు, ఏనుగంటి చిందెరెల్ల, ఏనుగంటి ఎస్టేట్ అగత్, ఎల్.పి.నం.4/2016/జిఎన్‌టి, ఎన్ఏ, గుంటూరు-522034 (కొలిచే ఏరియా ఉత్తరం: ఓపెన్ టు స్కై మరియు ఫ్లాట్ నం.510, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, 40 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ఓపెన్ టు స్కై మరియు కామన్ కారిడార్. స్వాధీనతా తేది: 23.03.2023	26/06/2021 Rs. 30,44,986.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.
తేది: 29 మార్చి, 2023
ప్రదేశం: గుంటూరు
ఆధీకృత అధికారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	**కెవిఎస్ ప్రసాద్ సీ ఫుడ్స్, కోసూరి మంజులాదేవి మరియు కోసూరి వెంకట శివప్రసాద్/డో.నం.15/191, కొత్త డో.నం.20-87, కోసూరి వారి పాలెం నిజాంపట్నం గుంటూరు ఆంధ్రప్రదేశ్ నిజాంపట్నం-522314/ 400105500125**	కెవిఎస్ ప్రసాద్ సీ ఫుడ్స్ యొక్క ఆస్తి వివరాలు: గుంటూరు జిల్లా మరియు నిజాంపట్నం మండలం, బావాజీపాలెం గ్రామ పంచాయతీ, మూల్యాంకనం నం.3887, కొత్త డో.నం.20-87, డో.నం.134/3బి లో ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగాలు మరియు పార్శిల్ బేరింగ్ ఆ రెసిడెన్షియల్ ఇంటి విస్తీర్ణం 400 చ.గ.లు. తో బేరింగ్ డో.నం.15/191, డాక్యుమెంట్ నం.1798/2006లో ఉన్న హద్దులు మరియు ఆస్తి హద్దులు: తూర్పు: కోసూరి అర్జునరావు కు చెందిన ఆస్తి, పడమర: సర్కార్ రోడ్డు దారి, ఉత్తరం: ఇమినిడి రంగరాజు మరియు ఇతరుల సైట్, దక్షిణం: కోసూరి అర్జునరావు యొక్క సైట్. లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 23 మార్చి, 2023	29-11-2022 Rs. 35,23,971/-	నిజాంపట్నం

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.
తేది : 29 మార్చి, 2023
ప్రదేశం : నిజాంపట్నం.
ఆధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్.

సంపాదకీయం

'బ్యాంకు' ప్రయోగశాల!

ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రితో సోమవారం భేటీ కావడం, అనంతరం వచ్చిన వార్తలు పరిశీలిస్తే రాష్ట్రం ప్రపంచ బ్యాంకు ప్రయోగశాలగా కొనసాగుతూనే ఉందన్న భావన ఎవరికైనా కలుగుతుంది. మరింత లోతుగా ఆ విధానాలు అమలు చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారా అనిపిస్తోంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఆనాటి ప్రభుత్వం 1990వ దశకంలో 'బ్యాంకు' నుండి స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్ లోన్ తీసుకోవడం, చేపట్టిన వినాశకర విధానాల దుష్ప్రభావాలు, పర్యవసానాలు అందరికీ తెలిసినవే! విద్యుత్ సంస్కరణల పేరిట ప్రజలపై జరిగిన దోపిడి, 2000 ఆగస్టులో ప్రజా ప్రతిఘటన చరిత్ర పుటల్లో చెరిగిపోనివి. ప్రపంచ బ్యాంకు రుణం అన్నా ముఖ్యంగా వారి ఆదేశాలతో చేపట్టే సంస్కరణలన్నా తెలుగు ప్రజలకు సాధారణంగా భయం కలుగుతుంది. ధర్మాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే యూజర్ చార్జీలు చెల్లించాలనీ, రైతు తన పొలానికి సాగు నీరు ఎంత వాడారో మీటర్లు బిగించి లెక్క కడతామనీ ఆనాడు సర్కారు అమలుకు పూనుకుంది. ప్రజల మాడు పగులగొట్టేలా విద్యుత్ చార్జీల భారం వేసింది. ప్రపంచ బ్యాంకు పేరు వింటేనే ఇలాంటి విషయాలన్నీ సినిమా రీల్ మాదిరి తిరుగుతుంటాయి. మళ్లీ ఏ భారం పడుతుందోనని జనం కలవరపడడం సహజం.

రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో ప్రస్తుతం అమలవుతున్న ఎ.పి హెల్త్ సిస్టమ్ స్ట్రెంగ్తెనింగ్ ప్రాజెక్టు (వైద్య ఆరోగ్య శాఖ), సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు (విద్యా శాఖ), ఎ.పి ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు (వ్యవసాయం, ఇరిగేషన్ తదితర శాఖలు) అమలు తీరుపై బ్యాంకు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో చర్చించింది. ఈ మూడు పథకాలు కలిపితే 824 మిలియన్ డాలర్లు అంటే సుమారు 6,500 కోట్ల రూపాయలు. వీటిలో మొదటి ప్రాజెక్టు 2018 లోనే మొదలు కాగా విద్యా, వైద్య రంగాల ప్రాజెక్టులు ఈ ప్రభుత్వం వచ్చాక ప్రారంభమైనవే. ఇప్పటికే సాల్ట్ ప్రాజెక్టు అమలులో భాగంగా తరగతుల విలీనం, పాఠశాలల మూసివేత వంటివి అనుభవంలోకి వచ్చాయి. కేవలం విద్యాశాఖలోనే గాక ఐసిడిఎస్ (అంగన్‌వాడీ) కూడా ప్రభావితమయ్యాయి. మరోవైపు బైజూస్‌కు విద్యా వ్యవస్థపై పెత్తనం దఖలు పడిపోతోంది. వాస్తవాలు ఇలావుండగా ప్రపంచ బ్యాంకు బృందం సర్కారుకు కితాబిచ్చింది. బ్యాంకు లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో కార్యక్రమాలు అమలవుతున్నాయని శ్లాఘించింది. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తమ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని, మరింత ముందుకు వెళ్లేందుకు ప్రపంచ బ్యాంకు తమ ప్రభుత్వంలో మరింత భాగస్వామ్యం కావాలని, రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై సమగ్రంగా అధ్యయనం చేసి ప్రపంచబ్యాంకు మరింత సహకారాన్ని అందించాలని సిఎం కోరారు. అంటే బ్యాంకు, సర్కారు బంధం బలపడుతోందన్నమాట.

ప్రపంచ బ్యాంకు రుణాలన్నీ నష్టదాయకమైనవని చెప్పలేం. కాని, విషమ షరతులతో కూడిన రుణాలు తీసుకుని ఆ 'సంస్కరణలు' అమలు చేస్తే అభివృద్ధికన్నా వినాశనమే ఎక్కువగా ఉంటుందన్నది గతానుభవం. ప్రస్తుతం సాల్ట్ అమలులో అటు పాఠశాల విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులతోపాటు అంగన్‌వాడీ లబ్ధిదార్లు, ఉద్యోగులూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అన్నం ఉడికిందా లేదా అన్నదానికి ఒక్క మెతుకు చూస్తే చాలునన్న చందంగా గడచిన రెండేళ్ల అనుభవం మన కళ్ల ముందుంది. నాడు-నేడు లేదా అమ్మ ఒడి వంటి పథకాల వల్ల సామాన్యులకు మేలు కలిగిన మాట నిజమే కాని అవి సాల్ట్ లో భాగం కాదు. సాల్ట్ ప్రాజెక్టు పర్యవసానాల్లోని ప్రతికూలాంశాలపట్ల ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించడం లేదు సరికదా ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు లేవనెత్తిన అభ్యంతరాలను తృణీకరించడం తగదు. ప్రపంచ బ్యాంకు చెప్పిందంతా అమలు చేసి, నయా ఉదారవాద విధానాలకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రయోగశాలగా చేయడం నష్టదాయకం. ప్రభుత్వం వాస్తవ దృక్పథంతో వ్యవహరించడం అవసరం. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదకర విధానాలను తిప్పికొట్టాలి.

మహనీయుల మాట



మనకు ఒక ఆయుధాన్ని ఇచ్చినందుకు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌కు రుణపడి వున్నాం. ఆ ఆయుధం మెషీన్ గన్ కాదు. అదే మార్క్సిజం-లెనినిజం.

\- మావో

毛澤東

గొంతు నొక్కుతున్న గోడీ మీడియా

విశ్లేషణ



వి.బి. పరమేశ్వరన్

కార్పొరేట్ మీడియా సంస్థలకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య మంచి సామరస్యం ఉందన్న వాస్తవాన్ని ఇటీవలి పరిణామాలు వెల్లడి చేస్తున్నాయి.

అదానీ అవినీతి బాగోతానికి సంబంధించిన కొన్ని విషయాలను అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ జనవరి చివరి వారంలో బయటపెట్టింది. ప్రపంచంలోకెల్లా అత్యంత ధనిక కార్పొరేట్‌గా అవతరించేందుకు అదానీ కంపెనీలు షేర్ ధరలు పెంచాయన్నది అందులో కీలకమైన అంశం. దీంతో అదానీ పతనం మొదలైంది. ఇది ప్రపంచ మీడియాలో పతాక శీర్షికలకెక్కగా, భారత మీడియా మాత్రం సాధారణ వార్తకు మించిన ప్రాధాన్యత ఇవ్వలేదు. మరోవైపు అదానీ ఒక్కరోజులో రెండు పూర్తి పేజీ ప్రకటనలు ప్రచురించి మీడియాను ప్రభావితం చేశాడు. కొన్ని జాతీయ వార్తాపత్రికలైతే హిండెన్‌బర్గ్ కథనాన్ని మొదటి పేజీలో ఇవ్వనేలేదు. ఇలాంటి వార్త బయటికి వచ్చినప్పుడు దీనికి కొనసాగింపుగా మరిన్ని పరిశోధనలు, బ్రేకింగ్ స్టోరీలు వస్తాయని నాలాంటి పాఠకులు భావించారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిన దేశంలోని అత్యంత సంపన్నుడు కుప్పకూలడం అనేది జాతీయ మీడియాకు పెద్ద వార్తగా కనిపించలేదు.



దీన్ని కేవలం ఒక వ్యాపార సామ్రాజ్య పతనంగా మాత్రమే చూడలేం. భారత ప్రధాని నరేంద్ర మోడీ నీడలో ఎదిగిన వ్యాపారవేత్త అదానీ. అందువల్ల ఆ తర్వాత కూడా ఈ వార్తల తదుపరి అంశాలను ఇవ్వడానికి, అసలు నిజానిజాలను బయటకు తీసుకురావడానికి ఏ మీడియా సంస్థా ఇష్టపడలేదు. ఈనాడు భారతీయ మీడియా అత్యంత శక్తిమంతమైన వ్యక్తుల పనిని విచారించడానికి భయపడుతోంది. అధికారులను ఇబ్బంది పెట్టే ప్రశ్నలు అడగకుండా మీడియా అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ అన్నట్టు ఇండియాలో పరిశోధనాత్మక జర్నలిజానికి తెర పడిందా అన్న అనుమానం వచ్చే పరిస్థితి ఏర్పడింది. మీడియా మౌనానికి కారణం ఏమిటి?

అదానీ కంపెనీలకు, మీడియాకు మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలే ఈ వార్తను కప్పిపెట్టడానికి ప్రధాన కారణమని 'న్యూస్ లాండ్రీ' ప్రచురించిన నివేదిక వెల్లడిస్తోంది. అర్థబలాన్ని ఉపయోగించి అదానీ కంపెనీకి వ్యతిరేకమైన వార్తలను అడ్డుకోవడంలో విజయం సాధించారు (అదానీ కంపెనీల గురించి ఇంతకు ముందు చెప్పినట్లు భారీ ప్రకటనలు ఇస్తున్నారు). ఇప్పుడు మీడియా మునుపటిలా అదానీ, ఇతర అనేక కార్పొరేట్లకు వ్యతిరేకంగా వార్తలు ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. దీనికి రకరకాల కారణాలున్నాయి. అందులో ఒకటి నేడు మీడియా ఎక్కువగా కార్పొరేట్ల చేతిలో వుంది. నయా ఉదారవాద యుగంలో, వార్తా ప్రయోజనాల కంటే యజమానుల ప్రయోజనాలే ప్రధానంగా తయారైనాయి. భారతదేశంలో కార్పొరేట్లు, అతివాద హిందూత్వ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేతులు కలిపి ముందుకు సాగుతున్నాయి. అందువల్ల ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే అదానీ కుంభకోణం గురించిన వార్తలను ఈ మీడియా ప్రచురించదు. రెండవది, మీడియా కార్పొరేట్ల మధ్య 'రహస్య ఒప్పందం' కూడా కార్పొరేట్ వ్యతిరేక వార్తలను అందించకుండా మీడియాను నిరుత్సాహపరుస్తున్నది. ప్రధాన జాతీయ వార్తాపత్రికలకు అనేక కంపెనీలలో వాటాలున్నాయి. అలాంటి కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఈ మీడియా ఎలాంటి వార్తలను ప్రచురించదనేది గ్యారెంటీగా చెప్పవచ్చు.

'మోడీస్ ఇండియా - హిందూ నేషనలిజం అండ్ ది రైజ్ ఆఫ్ ఎత్నిక్ డెమోక్రసీ' అనే పుస్తకంలో...ప్రజాస్వామ్యం యొక్క నాల్గవ స్తంభం కార్యనిర్వాహక వ్యవస్థకు సహ స్తంభంగా ఎలా మారిందో క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ వివరించారు. ప్రధాన స్రవంతి మీడియా 2002 గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్ర గురించి చెప్పడానికి కొంత సుముఖంగా ఉంది. ప్రధానిగా తాను ఏం చెబితే అది వినడం, ప్రశ్నలు వేయకపోవడం మోడీ విధానం. తాను చెప్పాలనుకున్నది 'మన్ కీ బాత్' ద్వారా, ట్విట్టర్ ద్వారా చెప్పే విధానం మోడీది.

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఎన్‌డిఎ సమావేశం ముగిసిన తర్వాత, ముఖ్యమైన క్యాబినెట్ సమావేశాల తర్వాత మీడియాను కలుస్తుండేవారు. అయితే ఇప్పుడు ఢిల్లీ జర్నలిస్టులకు ప్రధాని మోడీ విలేకరుల సమావేశానికి హాజరైన అనుభవం లేదు. అలాగే మాజీ ప్రధానులందరూ విదేశాలకు వెళ్లేటప్పుడు జర్నలిస్టులను తమ వెంట తీసుకెళ్లేవారు. విమానంలో ప్రధాని మీడియా సమావేశం ఏర్పాటు చేసేవారు. కానీ మోడీ ప్రధాని అయ్యాక ఇవేవీ జరగడంలేదు.

> మీడియాను లొంగదీసుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రధానంగా ఐదు పనులు చేస్తోందని క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ అంటున్నారు. ప్రభుత్వాన్ని, అధికార పార్టీని విమర్శించే మీడియాకు కేంద్ర ప్రభుత్వ ప్రకటనలను తిరస్కరించడం అందులో ఒకటి. మీడియాకు సంబంధించి ప్రకటనలు లేకపోతే మనుగడ లేదు. ప్రభుత్వ ప్రకటనలే మీడియాకు ప్రధాన ఆర్థిక వనరు. అది పూర్తిగా ఆగిపోతే మీడియా ప్రభుత్వాన్ని పొగడడం మినహా మరో మార్గం వుండదన్నది మోడీ సర్కార్ లెక్క.

కోవిడ్ రాకతో పార్లమెంట్ లోకి మీడియా ప్రవేశంపై ఆంక్షలు విధించారు. మీడియాను లొంగదీసుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రధానంగా ఐదు పనులు చేస్తోందని క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ అంటున్నారు. ప్రభుత్వాన్ని, అధికార పార్టీని విమర్శించే మీడియాకు కేంద్ర ప్రభుత్వ ప్రకటనలను తిరస్కరించడం అందులో ఒకటి. మీడియాకు సంబంధించి ప్రకటనలు లేకపోతే మనుగడ లేదు. ప్రభుత్వ ప్రకటనలే మీడియాకు ప్రధాన ఆర్థిక వనరు. అది పూర్తిగా ఆగిపోతే మీడియా ప్రభుత్వాన్ని పొగడడం మినహా మరో మార్గం వుండదన్నది మోడీ సర్కార్ లెక్క.

మీడియాను లొంగదీసుకోడానికి మరొక మార్గం ఏమిటంటే సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దాడులు నిర్వహించడం. కోవిడ్-19 రెండవ వేవ్ సమయంలో ప్రముఖ హిందీ వార్తాపత్రిక దైనిక్ భాస్కర్ ఒక ఫోటోను ప్రచురించిన మరుసటి రోజే ఇ.డి ఆ సంస్థ కార్యాలయాన్ని సందర్శించింది. దీంతో ప్రభుత్వ వ్యతిరేక వార్తలు తగ్గుముఖం పట్టాయి. ఇక చివరగా తమిళనాడులో బీహారీలను వేటాడుతున్నారని నకిలీ వార్తలు ఇచ్చి బిజెపి కి సహకరించిన ప్రధాన మీడియా సంస్థల్లో ఇదీ ఒకటి.

ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్న 'న్యూస్ క్లిక్' అనే వెబ్ పోర్టల్ చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ ఇల్లు, కార్యాలయంపై ఇ.డి దాడులు చేసింది. 114 గంటల పాటు ఇంటిని సోదా చేశారు. ఒక రోజుకు పైగా కార్యాలయాన్ని ముట్టడించగా, ఐదు రోజులు ఇంటిని ముట్టడించారు. అప్పుడు ఏమీ దొరకలేదు. ఇతర మీడియాలకు భిన్నంగా 'న్యూస్ క్లిక్' ఇప్పటికీ బిజెపి వ్యతిరేక వేదికగానే నిలుస్తోంది. ఎన్‌డి టీవీ కార్యాలయంపై కూడా దాడి చేశారు.

ప్రచురించడానికి, ప్రసారం చేయడానికి తాత్కాలికంగా అనుమతిని నిరాకరించడం ద్వారా మీడియాను కట్టడి చేయడం మరొక పద్ధతి. ఒకానొక సమయంలో, ఢిల్లీ అల్లర్లను నివేదించిన విధానాన్ని విమర్శించినందుకు ఏషియా నెట్, మీడియా వన్ ప్రసార అనుమతి నిరాకరించబడింది. ఏషియా నెట్ క్షమాపణ చెప్పిన తర్వాతే ప్రచురించడానికి అనుమతి లభించింది. ఆ తర్వాత మీడియా వాణికి కూడా అదే అనుభవం ఎదురైంది. ఆఖరికి మీడియా వాణిని ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పుల్వామా దాడిలో ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడిన ఎన్‌డి టివి కి ప్రసార అనుమతి కూడా నిరాకరించబడింది.

జర్నలిజాన్ని సీరియస్‌గా తీసుకునే జర్నలిస్టులను బహిష్కరించేలా వార్తాపత్రిక యాజమాన్యాలను ప్రభావితం చేయడం మోడీ ప్రభుత్వం అనుసరించిన మరో పద్ధతి. అందుకు అనేక ఉదాహరణలు చెప్పవచ్చు. 'ఔట్ లుక్' వారపత్రిక సంపాదకుడు రూబెన్ బెనర్జీని తొలగించడం అందులో ఒకటి.

కోవిడ్ రెండవ వేవ్ సమయంలో ఔట్ లుక్ వీక్లీలో 'మిస్సింగ్' పేరుతో కథనం విడుదలైంది. మే 2021లో ప్రచురించబడిన ఈ కవర్ స్టోరీ, వ్యాధి వ్యాప్తిని నిరోధించడంలో, వ్యాధి సోకిన వారికి చికిత్స చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చాటి చెప్పింది. మోడీ ప్రభుత్వ వాదనలు బూటకమని ఈ కథనం రుజువు చేసింది. సహజంగానే ఈ కవర్ స్టోరీ మోడీ ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. రూబెన్ బెనర్జీ ఎడిటర్ పదవిని కోల్పోయారు.

ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్‌లో బాలికపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని దాచిపెట్టిన పైశాచిక చర్యను ప్రపంచానికి బట్టబయలు చేసిన ఇండియా టుడే టెలివిజన్ తనుశ్రీ పాండే కూడా ఉద్యోగం కోల్పోయారు.

మీడియాను భయపెట్టడానికి, లొంగదీసుకోవడానికి ప్రభుత్వం...విమర్శనాత్మక జర్నలిస్టులను అరెస్టు చేయడం, చిత్రహింసలు పెట్టడం కూడా చూస్తున్నాం. ఆల్ట్ న్యూస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన మలయాళీ జర్నలిస్ట్ సిద్ధిక్ కప్పన్, కమ్యూనిజం కంబాట్ ఎడిటర్ మహమ్మద్ జుబేర్, తీస్తా సెతల్వాద్, హత్రాస్‌లో జరిగిన ఘటనను నివేదించేందుకు వెళ్లిన మనన్ గుల్జార్‌తో సహా కాశ్మీర్ లోని కొందరు జర్నలిస్టులను అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఏడాదిన్నర తర్వాత సిద్ధిక్ కప్పన్ జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు జుబేర్ మూడు వారాలకు పైగా జైలు జీవితం గడిపారు. తీస్తా జైలు నుంచి బయటకు రావడానికి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. 2014 నుంచి ఇప్పటి వరకు 100 మందికి పైగా జర్నలిస్టులను అరెస్టు చేశారు. దాదాపు 40 మంది జైలులో ఉన్నారు.

ది వైర్ ఎడిటర్, కారవాన్ మాజీ ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్, మలయాళీ జర్నలిస్టు వినోద్ కె జోస్, రాణా ఆయూబ్‌తో పాటు పలువురిపై దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. దీంతో చాలా మంది మీడియా వారు మౌనంగా వుండిపోవాల్సి వచ్చింది. బిజెపి కి, మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా లేని వార్తలు, కథనాలు, విశ్లేషణలను న్యూస్ డెస్క్ నుంచి మినహాయించే పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా తమంతట తాము సెన్సార్ విధించుకోవడం జర్నలిజానికి అతి పెద్ద ముప్పు.

ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల వాణిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా, డిజిటల్ మీడియా కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఇందుకు కొన్ని పరిమితులు ఉన్నాయన్నది తెల్సిన విషయమే. అదే సమయంలో కొన్ని అతిశయోక్తులు, తప్పుడు సమాచారం ప్రచారం చేయబడుతోంది. అయితే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా అనేవి ప్రతిపక్ష పాత్రలో సానుకూల పాత్ర పోషిస్తున్నాయి. అధికార పార్టీ, ప్రభుత్వం సృష్టించిన అనేక నకిలీ వార్తలను అవి బహిర్గతం చేస్తుంటాయి. మోడీ ప్రభుత్వం వాటి నోరు మూయించే ప్రయత్నాలు ప్రారంభించింది. ఐటీ రూల్ 2021ని సవరించడం అందులో భాగమే. పిఐబి నకిలీ వార్తలుగా నిర్ధారించినవి పూర్తిగా తొలగించబడతాయి. ఆకాశవాణి, దూరదర్శన్ అందించే వార్తలను పూర్తిగా సెన్సార్ చేయడంలో భాగంగా పిటిఐ ఏజెన్సీని మినహాయించి ఆర్‌ఎస్‌ఎస్ వార్తా సంస్థ హిందుస్థాన్ సమాచార్‌తో ఒప్పందం కుదిరింది. భారతీయ మీడియా అక్షరాలా గోడీ మీడియాగా మారిపోయింది. ఈ మీడియా కాషాయీకరణ భారత ప్రజాస్వామ్యాన్ని కూడా నాశనం చేస్తుందనడంలో సందేహం లేదు.

('పేట్రియాట్ వీక్లీ' నుండి)

ఎదురు దెబ్బలు తగిలినా ఆగని అమెరికా యుద్ధోన్మాదం


అంతర్జాతీయం

ఎం.కె.ఆర్

ఇటీవలి వరకు అమెరికా తొత్తుగా ఉన్న హోండూరాస్ ఆదివారం దానితో సంబంధాలను తెగతెంపులు చేసుకొని చైనాతో దౌత్య సంబంధాలను ఏర్పాటు చేసుకుంది. ఇంతకు ముందున్న ప్రభుత్వం అమెరికా ప్రాపకం కోసం తైవాన్‌ను ఒక దేశంగా గుర్తించింది. ఇప్పుడు అక్కడ వామపక్ష శక్తులు అధికారానికి రావటంతో సీన్ రివర్స్ అయ్యింది. మారుతున్న బలాబలాలకు నిదర్శనంగా 2016 నుంచి ఇప్పటి వరకు తొమ్మిది దేశాలు తైవాన్‌ను వదలి చైనాతో సంబంధాలు పెట్టుకున్నాయి. హోండూరాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపిన అమెరికా చివరికి చేసేదేమీ లేక మీ నిర్ణయాన్ని గౌరవిస్తామని చెప్పింది.

ఇటీవలి కాలంలో తమ ఆధిపత్యానికి సవాలు ఎదురవుతున్నదనే భయం అమెరికాను పట్టి పీడిస్తున్నది. అమెరికా ఆయుధ ఉత్పత్తిదారులు నిరంతరం ఎక్కడో ఒక చోట ఉద్రిక్తత, రక్తపాతాన్ని కోరుకుంటారు. దానికి అనుగుణంగా అమెరికా ప్రభుత్వం పని చేస్తుంది. రానున్న పది సంవత్సరాల్లో పశ్చిమ పసిఫిక్, ఆసియాలో చైనా పెద్దదిగా ఉంటుందని, 2049 నాటికి మొత్తంగా సామర్థ్యంలో అమెరికా మిలిటరీని అధిగమించనుందని అమెరికా మిలిటరీ జాయింట్ చీఫ్ మార్క్ మిలే చెప్పాడు. చైనాతో పోరును దృష్టిలో వుంచుకొని అమెరికా రక్షణ బడ్జెట్‌ను పెంచుతున్నట్లు రక్షణ మంత్రి లాయడ్ ఆస్టిన్ చెప్పాడు. రక్షణ సన్నద్ధతను కొనసాగించేందుకు జో బైడెన్ ప్రభుత్వం రికార్డు స్థాయిలో బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. దీనితో ప్రతి విభాగాన్ని సంసిద్ధం గావించవచ్చన్నారు. మొత్తం లక్ష కోట్ల డాలర్లను బైడెన్ సర్కార్ సిద్ధం చేసింది. మిలిటరీ ఎత్తుగడల గురించి కూడా మిలే, ఆస్టిన్ వెల్లడించారు. ఆర్థికంగా దిగజారుడును మిలిటరీ హింసాకాండ ద్వారా పూడ్చుకోవచ్చని అమెరికా భావిస్తున్నది. ఏ దేశంలోనూ లేని విధంగా చైనాలో సంపద, వృద్ధి జరుగుతున్నదని, చైనా సంపద ఎంతగా పెరిగితే అంతగా ప్రపంచ శక్తిగా ఎదుగుతుందన్న భయం అమెరికాకు పట్టుకుంది.

సినిమాలు, టీవీ చిత్రాల ద్వారా అమెరికన్లకు ముప్పు ఎలా ఎటువైపు నుంచి వస్తున్నదో చూపటం అక్కడ జరుగుతున్నది. వాటిలో గతంలో రష్యన్లు, ఇతర అమెరికా వ్యతిరేకులను ప్రతినాయకులుగా చూపేవారు. వారి మీద అమెరికన్లలో ద్వేషం పుట్టించేవారు. ఇప్పుడు చైనా, ఇతర దేశాల వారిని కూడా



> ఇటీవలి కాలంలో తమ ఆధిపత్యానికి సవాలు ఎదురవుతున్నదనే భయం అమెరికాను పట్టి పీడిస్తున్నది. అమెరికా ఆయుధ ఉత్పత్తిదారులు నిరంతరం ఎక్కడో ఒక చోట ఉద్రిక్తత, రక్తపాతాన్ని కోరుకుంటారు. దానికి అనుగుణంగా అమెరికా ప్రభుత్వం పని చేస్తుంది. రానున్న పది సంవత్సరాల్లో పశ్చిమ పసిఫిక్, ఆసియాలో చైనా పెద్దదిగా ఉంటుందని, 2049 నాటికి మొత్తంగా సామర్థ్యంలో అమెరికా మిలిటరీని అధిగమించనుందని అమెరికా మిలిటరీ జాయింట్ చీఫ్ మార్క్ మిలే చెప్పాడు. చైనాతో పోరును దృష్టిలో వుంచుకొని అమెరికా రక్షణ బడ్జెట్‌ను పెంచుతున్నట్లు రక్షణ మంత్రి లాయడ్ ఆస్టిన్ చెప్పాడు.

ప్రధానంగా చూపుతున్నారు. దానిలో భాగంగానే ఇటీవల కొన్ని అమెరికా సంస్థలు, పార్లమెంటు లోని రిపబ్లికన్ పార్టీ సభ్యులు కొన్ని ఊహాజనిత యుద్ధ క్రీడలను కంప్యూటర్లలో సృష్టించి జనానికి చూపుతున్నారు. వాటి ప్రకారం 2025 నాటికి తైవాన్ అంశం మీద అమెరికా-చైనా పోరుకు తలపడతాయని, దానిలో చైనా ఓడిపోతుందని చిత్రించారు. ఇది హాలీవుడ్ సినిమా వంటిదే. వాటిలో అమెరికా సిఐఏ గూఢచారులను తెలివిగలవారిగా ఇతర దేశాల వారిని దద్దమ్మలుగా చిత్రిస్తారు. నిజానికి ఇంతవరకు ఏ ఒక్క యుద్ధంలోనూ అమెరికా గెలిచిన ఉదంతం లేదు. అమెరికా రిటైర్డ్ నావీ అధికారి మార్క్ మాంట్‌గోమరీ ఓర్లాండోలో రిపబ్లికన్ ఎంపీలకు చైనాతో పోరు అనే ఒక ఊహా చిత్రాన్ని చూపాడు. దానిలో వేలాది మంది అమెరికన్లు మరణిస్తారని, విమానవాహక నావలను ముంచివేస్తారని చిత్రించాడు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మిలిటరీలో పని చేస్తున్న వారిలో 15 నుంచి 50 మంది లేదా దేశం మొత్తంగా ఐదు నుంచి ఇరవై వేల మంది ఒక వారంలో మరణిస్తారని చూపాడు. దానిలో తైవాన్ రక్షణకు అమెరికా దళాలు చైనా ప్రధాన ప్రాంతంపై ఎలా దాడి చేసేది, దాని నౌకలను ఎలా ముంచేది, మిలిటరీని ఎలా చక్రబంధం చేసేది, వివిధ కోణాల్లో జరిగే పర్యవసానాలను చూపారు. ఇలాంటి వాటిని బూచిగా చూపి అమెరికా తన దుర్మార్గాలకు జనం సమ్మతిని సృష్టించాలని చూస్తున్నది. ఉక్రెయిన్ మాదిరి కాకుండా తైవాన్ ఆక్రమణకు చైనా పూనుకుంటే నేరుగా అమెరికా మిలిటరీని దింపుతారా అన్న ప్రశ్నకు జో బైడెన్ అవును అని సమాధానమిచ్చాడు.

ప్రజాబలం, పట్టుదలలో ఎంతో ఉన్నతంగా ఉన్నప్పటికీ మిలిటరీ రీత్యా అమెరికాతో 50 సంవత్సరాల నాడు వియత్నాం సరితూగే స్థితిలో లేదు. అయినా బతుకు జీవుడా అంటూ అమెరికా మిలిటరీ ఎలా పారిపోయిందీ ప్రపంచమంతా చూసింది. ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిందీ అదే. తాలిబాన్లకు సలాం కొట్టి అమెరికన్లు వెళ్లారు. అలాంటిది చైనాతో ఢీకొనగలమని అమెరికన్లను నమ్మించేందుకు అక్కడి యుద్ధోన్మాదులు చూస్తున్నారు. "నూతన యుగంలో తైవాన్ సమస్య, చైనా పునరేకీకరణ" అనే పేరుతో 2022 ఆగస్టు పదవ తేదీన చైనా ఒక శ్వేత పత్రాన్ని ప్రకటించింది. తైవాన్ తనలో అంతర్భాగమే అని మరోసారి స్పష్టం చేసింది. ఒకే చైనా సూత్రానికి ఐరాస సాధారణ అసెంబ్లీ 2758వ తీర్మానం ద్వారా కల్పించిన చట్టబద్ధతపై ఎలాంటి సందేహం లేదని, ప్రపంచమంతటా గుర్తింపు పొందిందని దానిలో పేర్కొన్నారు. శాంతియుతంగా పునరేకీకరణ జరగాలని, తప్పనిసరైతే బలప్రయోగం తప్పదని కూడా స్పష్టం చేశారు. ఒకే దేశం-రెండు వ్యవస్థలనే విధానం కింద తైవాన్‌కు హామీ ఇస్తున్నట్లు తెలిపింది.

చైనాపై ఒత్తిడి పెంచే పన్నాగంలో భాగంగానే నేడు ఉక్రెయిన్, రేపు తైవాన్ అన్న ప్రచారాన్ని అమెరికా ప్రారంభించింది. దేనికైనా సిద్ధమేనని చైనా కూడా స్పష్టం చేయదలచుకుంది. తాజాగా మిలిటరీకి అందచేసిన వాటితో సహా విన్యాసాల్లో భూ, సముద్ర, గగన తల అస్త్రాలన్నింటినీ బహిరంగంగానే చూపింది. ఉక్రెయిన్ సంక్షోభం తరువాత చైనా-రష్యా బంధం మరింతగా బలపడిన పూర్వరంగంలో చైనా మీద మరింతగా కేంద్రీకరించాలని అమెరికా గూఢచార సంస్థలు ఒక నిర్ణయానికి వచ్చాయి. దానికి ప్రతిగానే ఇటీవల జిన్‌పింగ్ మాస్కో వెళ్లి పుతిన్‌తో మరింత గట్టిగా బంధానికి తెరతీశాడు.

ఏడు దశాబ్దాల నాడున్న చైనాకు నేటి చైనాకు ఏ విధంగానూ పోలికే లేదు. ఇరాన్-సౌదీ ఒప్పందాన్ని కుదిర్చి తన పలుకుబడి ఏమిటో ప్రపంచానికి చాటింది. ఇటీవల డేనియల్ ఎల్స్‌బర్గ్ బయటపెట్టిన పెంటగాన్ పత్రాల్లోని వివరాల ప్రకారం 1958లో తైవాన్ విలీనానికి పూనుకోవాలని మావో నిర్ణయించారని, దాన్ని గ్రహించిన అమెరికా వెంటనే తన సప్తమ నౌకా దళాన్ని దాడికి వీలైన దూరానికి పంపిందని స్పష్టమౌతోంది. ఒకవేళ మిలిటరీ తైవాన్‌ను కాపాడలేకపోతే అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు అధ్యక్షుడు ఐసెన్ హోవర్ అనుమతి ఇచ్చాడు. తైవాన్ పాలకుడు చాంగ్‌కై షేక్‌ను, తైవాన్‌ను ఎలాగైనా కాపాడటం అమెరికాకు ప్రాముఖ్యత కలిగిన అంశం. అందుకు పూనుకొని విఫలం కావటం ఆసియాలో పరువు తక్కువ, దాన్ని కాపాడుకొనేందుకు ఎంతకైనా తెగించాల్సిందేనని మిలిటరీ జనరల్స్ చెప్పారు. అప్పటికే అవసరం లేకున్నా జపాన్‌పై అణు దాడి జరిపిన అమెరికా కమ్యూనిజం విస్తరణను అడ్డుకోవాలని చూసింది. తైవాన్‌కు సమీపంలోని ప్రధాన భూభాగంలో ఒక చిన్న మిలిటరీ కేంద్రం తప్ప చైనా వద్ద అప్పటికి అణుబాంబులు గానీ, విమానవాహక నౌకలుగానీ లేవు. ఆర్థికంగా పటిష్టత కూడా లేదు. సోవియట్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేదు. 1959లో టిబెట్‌లో దలైలామా తిరుగుబాటు, అదే ఏడాది చైనా అణు కార్యక్రమానికి సహకరించేది లేదని సోవియట్ ప్రకటించింది. రెండు దేశాల పార్టీల మధ్య సైద్ధాంతిక విబేధాలు తీవ్రమౌతున్న తరుణంలో అన్ని అంశాలను చూసినపుడు వెనక్కు తగ్గటమే మంచిదని నాటి చైనా నాయకత్వం భావించింది. తరువాత దేశాన్ని పటిష్టం గావించటం మీద శ్రద్ధ పెట్టింది. ఇప్పుడు ఆ బలహీనతలన్నింటినీ అధిగమించింది. గతంలో ఐసెన్ హోవర్ మాదిరే ఇప్పుడు జో బైడెన్ కూడా ఉక్రెయిన్ మాదిరి కాకుండా అవసరమైతే మిలిటరీని దింపుతామని ప్రకటించాడు. గతంలో మావో మాదిరి ఇప్పుడు జిన్‌పింగ్ వెనక్కు తగ్గేందుకు చైనా సిద్ధం కాదు. అన్ని రంగాల్లో ఢీ అంటే ఢీ అనేందుకు దీటుగా దేశాన్ని రూపొందిస్తున్నాడు. అందుకే నిప్పుతో చెలగాటాలు ఆడవద్దని బైడెన్‌తో భేటీలో జిన్‌పింగ్ హెచ్చరించగలిగాడు.

★

కవిత్వం

ఏమిటో ఈ మనుషులు!

ప్రాణం లేని
పసుపు, కుంకుమ పూసిన
రాయి కనిపిస్తే చాలు
పొర్లుదండాలు పెట్టేస్తారు
ప్రాణం ఉన్న
మానవత్వపు మనుషులకు
ఒక దండం కూడా పెట్టరు
ఏమిటో ఈ మనుషులు !

తప్ప తాగి మత్తులో
రోడ్డుకు అడ్డంగా పడుకున్న
తాగుబోతుల మొహంపై
నీళ్ళు చల్లి లేవకొడతారు
రోడ్డు ప్రమాదంలో
కొట్టు మిట్టాడే మనుషులను
కాపాడే ప్రయత్నం చేయరు
ఏమిటో ఈ మనుషులు!

పాములు గుడ్డు, పాలు తాగవని
తెలిసి పుట్టలో పోసి
ఉక్కిరి బిక్కిరి చేస్తారు
పౌష్టికాహార లోపం ఉన్న
అనాథ వీధి బాలలకు
ఒక అన్నం ముద్ద పెట్టరు
ఏమిటో ఈ మనుషులు!

కాళ్ళరిగేలా పాదయాత్ర చేసి
వెంకన్న గుడి మెట్లెక్కి
లక్షల రూపాయలు
హుండీలో వేస్తారు
అనాథ వృద్ధాశ్రమాలకు
రూపాయి విరాళం కూడా
విదల్చరు...
ఏమిటో ఈ మనుషులు!

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 7780277240

బిబిసి పంజాబ్ ట్విట్టర్ ఖాతాపై నిషేధం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తితో బిబిసి పంజాబ్ న్యూస్ ఖాతాను ట్విట్టర్ విత్‌హెల్డ్‌లో ఉంచింది. ఈ విషయాన్ని న్యూస్ పోర్టల్ సౌత్ ఆసియా జర్నల్ తెలిపింది. ట్విట్టర్ సంస్థ దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వలేదు.


రూ.8.72 లక్షల కోట్ల మాఫీ

ఐదేళ్లలో

కార్పొరేట్లకు మోడీ సర్కార్ నజరానా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతులకు రుణాలు మాఫీ చేసేందుకు చేతులు రాని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఏటా లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తోంది. గత ఐదేళ్లలో దేశంలోని కార్పొరేట్లు తీసుకున్న రుణాలు రూ.8,72,778 కోట్లు మాఫీ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవంత్ కరాడ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2017-18 నుంచి 2021-22 వరకు ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.6,31,693 కోట్లు, ప్రైవేట్‌రంగ బ్యాంకులు రూ.2,24,855 కోట్లు, విదేశీ బ్యాంకులు రూ.16,230 కోట్లు మాఫీ చేశాయని తెలిపారు.



కేంద్రం అప్పు రూ.155.8 లక్షల కోట్లు.. వడ్డీ రూ.9.4 లక్షల కోట్లు

కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.155.8 లక్షల కోట్లకు చేరిందని, దీనికి వడ్డీనే రూ.9.4 లక్షల కోట్లు అవుతుందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి వి.శివదా సన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధా నం ఇచ్చారు. 2022-23 సవరించిన బడ్జెట్ అంచనాల్లో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.155.8 లక్షల కోట్లు కాగా, అందులో రూ.148.8 లక్షల కోట్లు దేశీయ అప్పు, రూ.7 లక్షల కోట్లు విదేశీ అప్పు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అప్పు కూడా ఏడాదికి ఏడాది భారీగా పెరుగుతుంది. 2017-18లో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.82.9 లక్షల కోట్లు కాగా, 2018-19లో అది రూ.92.5 లక్షల కోట్లకు, 2019-20లో రూ.105.2 కోట్లకు, 2020-21లో రూ.122.1 లక్షల కోట్లకు, 2021-22లో రూ.138.9 కోట్లకు, 2022-23లో రూ.155.8 లక్షల కోట్లకు పెరిగిపోయింది. దేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి)లో అప్పుల వాటా 2017-18లో 48.5 శాతం, 2018-19లో 49 శాతం, 2019-20లో 52.4 శాతం, 2020-21లో 58.7 శాతం, 2022-23 (సవరించిన బడ్జెట్ అంచనా)లో 57.3 శాతం ఉంది. దీనినిబట్టి చూస్తే జిడిపిలో అప్పుల వాటా ఏడాదికి ఏడాది పెరుగుతుంది.

రూ. 82కి పడిపోయిన రూపాయి విలువ

అమెరికా డాలర్‌తో పోల్చితే దేశీయ కరెన్సీ రూపాయి విలువ రూ.82కి పడిపోయిందని పంకజ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రూ.82.4845కి రూపాయి విలువ పతనమైందని తెలిపారు.

దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం 6.75 శాతం ద్రవ్యోల్బణం నమోదు

దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇచ్చిన సమాధానంలో దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదల స్పష్టమైంది. 2022-23 (ఏప్రిల్- ఫిబ్రవరి) మధ్య 6.75 శాతం వినియోగదారు ధరల సూచిక-కంబైన్డ్ (సిపిఐ-సి) ద్రవ్యోల్బణం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. 2021-22లో సిపిఐ-సి ద్రవ్యోల్బణం 5.51 శాతం ఉందని పేర్కొన్నారు.

వలస కార్మికులపై దాడుల గణాంకాలు లేవు : కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్

దేశంలో వలస కార్మికులపై దాడులు, రాష్ట్రాలు తీసుకున్న చర్యలు, కార్మికులు ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వలస వెళ్లడం వంటి పుకార్లపై ఎటువంటి డేటా కేంద్ర ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. హింసను ప్రేరేపించే అవకాశం ఉన్న నకిలీ వార్తలు, పుకార్ల ప్రసారంపై నిఘా ఉంచేందుకు, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కు 2018 జూలై 4న ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు.

3.90 శాతం నుంచి 2.92 శాతానికి తగ్గిన వ్యవసాయ బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖల బడ్జెట్ కేటాయింపులు తగ్గాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22లో వ్యవసాయ బడ్జెట్ 3.90 శాతం నుంచి 2022-23లో 3.15 శాతానికి, 2023-24లో బడ్జెట్‌లో 2.92 శాతానికి తగ్గిందని తెలిపారు.

ఏపిలో 275, తెలంగాణలో 297 వెటర్నరీ వైద్యుల పోస్టులు ఖాళీ

ఏపిలో 275, తెలంగాణలో 297 వెటర్నరీ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మత్స్య, పశువర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏపిలో 1,781 వెటర్నరీ వైద్యుల మంజూరు పోస్టులు కాగా, అందులో 275 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో 1,223 వెటర్నరీ వైద్యుల మంజూరు పోస్టులు కాగా, అందులో 297 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

పార్లమెంట్‌లో కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ప్రతిపక్షాలకు పోటీగా అధికార పక్షం కూడా ఆందోళన చేపట్టింది. అదానీ అంశంపై ప్రతిపక్షాల నేతలు నల్ల దుస్తులు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలంటూ బిజెపి సభ్యులు ఆందోళన చేయడంతో మంగళవారం ఉభయ సభల కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు హోరెత్తించారు. కేవలం రెండు నిమిషాల్లో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి అదానీ సమస్యపై జెపిసి విచారణకు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాగితాలు చించి స్పీకర్ చైర్‌పైకి విసిరారు. నలుపు క్లాత్‌ను కూడా విసిరారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే సభను బుధవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది.

కెనడాలో గాంధీ విగ్రహం ధ్వంసం

- రోజుల వ్యవధిలోనే రెండో ఘటన
- ఖలిస్తాన్ వేర్పాటువాదుల ఆగడం

టొరంటో : కెనడాలో మహాత్మ గాంధీ విగ్రహానికి మరోసారి అవమానం జరిగింది. ఖలిస్తానీ వేర్పాటువాదులుగా భావిస్తున్న కొందరు బ్రిటీష్ కొలంబియా ప్రావిన్స్‌లోనిసైమన్ ఫ్రాజర్ యూనివర్శిటీ కేంపస్‌లో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. మహాత్ముడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం వారం రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. ఇంతకుముందు ఓంటారియో ప్రావిన్స్‌లోని హామిల్టన్ పట్టణంలోని సిటీ హాల్‌కి సమీపంలోని మహాత్ముని విగ్రహాన్ని ఖలిస్తాన్ మద్దతుదారులు ఇలాగే ధ్వంసం చేశారు. జాతిపిత విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వాంకోవర్‌లోని భారత కాన్సులేట్ జనరల్ వ్యాఖ్యానించారు. ఇందుకు బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని కెనడా అధికారులను ఆయన కోరారు. నేరపూరితమైన, విద్వేషంతో కూడిన ఈ చర్యవల్ల కెనడాలోని భారతీయుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆ సమయంలో కాన్సులేట్ జనరల్ ట్వీట్ చేసింది.

సూకీ పార్టీ రద్దు

- మయన్మార్ జుంటా ప్రకటన

నెపిడా : మయన్మార్ నేత ఆంగ్ సాన్ సూకీ రాజకీయ పార్టీ నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ (ఎన్‌ఎల్‌డి)ను మయన్మార్ జుంటా రద్దు చేసింది. దేశంలో తదుపరి నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు రిజిస్టర్ చేసుకోవడానికి తిరస్కరించిన కారణంగా పార్టీని రద్దు చేయాలని జుంటా నియమించిన ఎన్నికల కమిషన్ భావించింది. మంగళవారం అర్ధరాత్రి నుండి ఈ రద్దు అమల్లోకి వచ్చింది. ఈ ఎన్నికలను వట్టి మోసం, మాయగా ఎన్‌ఎల్‌డి అభివర్ణిస్తోంది. మీడియాకు స్వేచ్ఛను హరించివేసి, సూకీ పార్టీ నేతల్లో ఎక్కువమందిని అరెస్టు చేసిన తరుణంలో సైన్యం పాలించే దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా సక్రమంగా జరగబోవని విమర్శకులు పేర్కొంటున్నారు. పలువురు రాజకీయ నేతలను, కార్యకర్తలను వేధిస్తూ, అరెస్టు చేస్తున్న సమయంలో ఎన్నికలను ఆమోదించబోమని ఎన్‌ఎల్‌డి మాజీ నేత వ్యాఖ్యానించారు. రాజకీయంగా మోపబడిన వరుస కేసుల్లో దోషిగా నిర్ధారించబడిన సూకీ ప్రస్తుతం 33 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు.

ఎన్నికల్లో పోటీ చేయకుండా జెరెమీ కార్బిన్‌పై నిషేధం

లండన్ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లేబర్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయకుండా మాజీ నేత జెరెమీ కార్బిన్‌పై బ్రిటన్ ప్రధాన ప్రతిపక్షం లేబర్ పార్టీ నిషేధం విధించింది. పార్టీ వామపక్ష విభాగంతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని ఆయన వారసుడు కెయిర్ స్టార్మర్ భావిస్తున్నారు. ఈ మేరకు స్టార్మర్ చేసిన ప్రతిపాదనను జాతీయ కార్యవర్గ కమిటీ 22-12 ఓట్ల తేడాతో ఆమోదించిందని పార్టీ ప్రతినిధి తెలిపారు. 2020లో లేబర్ నేతగా ఎన్నికైనప్పటి నుండి లేబర్ పార్టీని మధ్యే దిశగా నడిపించేందుకు కృషి చేస్తున్నారు. తాను చేయబోయే మార్పులు ఇష్టం లేకపోతే ఎవరూ బలవంతంగా ఇక్కడ వుండాలని ఒత్తిడి చేయరని గత నెల్లో కార్బిన్ మద్దతుదారులతో స్టార్మర్ వ్యాఖ్యానించారు. ప్రముఖ సోషలిస్టు అయిన కార్బిన్ 2017లో ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో ఆయన నేతృత్వంలో పార్టీ ఓటమి పాలైంది. 2025 జనవరిలోగా బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించాల్సి వుంది. ఈ రోజు ప్రజాస్వామ్యంలో దుర్దినంగా మొమెంటం వ్యాఖ్యానించింది.

మెక్సికో శరణార్థుల కేంద్రంలో అగ్ని ప్రమాదం

- 39 మంది మృతి, 29 మందికి గాయాలు

మెక్సికో సిటీ : మెక్సికోలోని శరణార్థుల కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించి 39మంది మరణించారని, 29మంది గాయపడ్డారని మెక్సికో జాతీయ ఇమ్మిగ్రేషన్ ఇనిస్టిట్యూట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేంద్రంలో మొత్తంగా 68 ఉన్నారని పేర్కొంది. వెంటనే ఈ సంఘటనపై మెక్సికో అటార్నీ జనరల్ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించిందని మీడియా వార్తలు తెలిపాయి. సోమవారం అర్ధరాత్రి ఈ కేంద్రంలో మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే అంబులెన్సులు, అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకోవడం కనిపించింది. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్ముకుపోవడం కనిపిస్తోంది. శరణార్థులకు సాయం అందించడానికి ప్రభుత్వ జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ విషాదానికి దారి తీసిన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించారు. అమెరికాలో ప్రవేశించే వారికి సియుడాడ్ జారెజ్ ప్రధాన క్రాసింగ్ పాయింట్‌గా వుంది. ఇక్కడి షెల్టర్లన్నీ వలసవాదులు, శరణార్థులతో నిండివుంటాయి. ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు అమెరికాలో ప్రవేశించడానికి వారు ఇక్కడ వేచి చూస్తుంటారు. లేదా అమెరికాలో ఆశ్రయం కోరి అనుమతి కోసం ఎదురుచూస్తున్నావారై వుంటారు. కోవిడ్ సంబంధిత నియంత్రణలు ఎత్తివేసిన తర్వాత ఇలా ఆశ్రయం కోరేవారిపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ కొత్త ఆంక్షలు విధించారు. అమెరికా సరిహద్దులు దాటి వచ్చేవారికి ఆ దేశంలో ఆశ్రయం లభించదన్నది కొత్త నిబంధనల సారాంశం.

అమెరికాలో విజృంభిస్తున్న వర్ణవివక్ష, అసమానతలు

- చైనా నివేదిక వెల్లడి

బీజింగ్ : వర్ణ వివక్ష, అసమానతలు అమెరికాలో రోజురోజుకూ విజృంభిస్తున్నాయని చైనా స్టేట్ కౌన్సిల్ ఇన్ఫర్మేషన్ ఆఫీస్ మంగళవారం విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఇటీవలి సంవత్సరాల్లో అమెరికాలో విద్వేష నేరాలు, విద్వేష ప్రసంగాల ఘటనలు గణనీయంగా పెరిగా యని ఆ నివేదిక తెలిపింది. తుపాకీ కాల్పులు, మరణాలు కూడా బాగా పెరిగాయని పేర్కొంది. నల్లజాతీయులు, మైనారిటీ జాతులకు చెందిన వారు వైద్య సంరక్షణ, విద్య, గృహ నిర్మాణం, ఇతర రంగాల్లో వ్యవస్థాగతమైన వివక్షను ఎదుర్కొంటూనే వున్నారని పేర్కొంది. వర్ణ వివక్ష విస్తృతంగా వ్యాపించిందని, శ్వేత జాతీయులు ఎక్కువ, నల్లజాతీయులు తక్కువ అనే భావన అమెరికా వ్యవస్థల్లో లోతుగా పాతుకుపోయి విడదీయరానిదిగా మారిపోయిందని ఆ నివేదిక హెచ్చరించింది. అమెరికాలోని 15 ప్రధాన నగరాల్లో 2020, 2021లో విద్వేష నేరాల సంఖ్య రెండంకెలకు చేరుకుంది. పక్షపాతంతో ప్రేరేపించబడిన సంఘటనలు 2022 ఆగస్టులో ఐదు శాతం పెరిగాయని నివేదిక తెలిపింది. కాలిఫోర్నియా రాష్ట్ర యూనివర్శిటీలో విద్వేషం, తీవ్రవాదంపై అధ్యయన కేంద్రం నిర్వహించిన సర్వేలో వెల్లడైన అంశాలను ఆ నివేదిక ఉటంకించింది. ఆరోగ్య సేవల రంగంలో అసమానతలు చాలా తీవ్రంగా వున్నాయని పేర్కొంది. వర్ణ, జాతి మైనారిటీ ప్రజలు దేశంలోకెల్లా అత్యధిక సంఖ్యలో ప్రసూతి మరణాలను ఎదుర్కొంటున్నారని వర్ణవివక్ష నిర్మూలనపై ఐక్యరాజ్య సమితి కమిటీ వ్యాఖ్యానించింది.

ఇక అమెరికన్ ఇండియన్స్ తమ కష్టాలు తీరతాయని భావించడం లేదు. ఫెడరల్ ఇండియన్ బోర్డింగ్ స్కూల్ ఇనీషియేటివ్ మొదటి భాగాన్ని గతేడాది మే 11న అమెరికా హోం శాఖ విడుదల చేసింది. ఆదివాసీ అమెరికన్ల పిల్లలను వారి కుటుంబాల నుంచి వేరు చేసి, వారి భాష, సంస్కృతులకు దూరం చేసి, శ్వేత జాతీయులైన అమెరికా సమాజంలో సమ్మిళితం చేయడానికి గతంలో ఫెడరల్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందని హోం శాఖ అంగీకరించిందని ఆ నివేదిక పేర్కొంది.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : ఎఐకెఎస్ డిమాండ్

న్యూఢిల్లీ : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో తీవ్రమైన నష్టం వాటిల్లిందని, రబీ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గోధుమ, ఆవాలు, కూరగాయలు మొదలైన పంటలు అకాల వర్షాలకు, వడగళ్లకు, తీవ్రమైన గాలులకు దెబ్బతిన్నాయని తెలిపింది. పంటలు చివరి దశకు వచ్చిన సమయంలో నష్టం జరగడంతో రైతులు పెట్టుబడినంతా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేసింది.

హర్యానా రాష్ట్రంలో దెబ్బతిన్న పంటలను ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు ఇంద్రజిత్, రాష్ట్ర నాయకులతో కలిసి సందర్శించారు. బాధిత రైతులతో మాట్లాడారు. నష్ట పరిహారం చెల్లించడం కోసం నష్టాన్ని అంచనా వేయడానికి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఇంద్రజిత్ డిమాండ్ చేశారు. కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని ఎఐకెఎస్ తెలిపింది. పంట నష్టపోయినప్పటికీ భూయజమానికి కౌలు రైతులు కౌలు మొత్తం చెల్లించాల్సి ఉంటుందని గుర్తు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా విరివిగా పనులు చేపట్టాలని కోరింది.

18 ఫార్మా సంస్థల అనుమతులు రద్దు

న్యూఢిల్లీ : నకిలీ, కల్తీ మందులు తయారు చేస్తున్న 18 ఫార్మా సంస్థల అనుమతులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. గత ఏడాది భారత్‌లో ఉత్పత్తయిన దగ్గు మందులు వినియోగించి ఆఫ్రికా దేశాల్లో పలువురు చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో తమిళనాడులోని గ్లోబల్ ఫార్మా హెల్త్‌కేర్ ఉత్పత్తి చేసిన కంటి చుక్కల మందు వినియోగించి అమెరికాలో కొంతమంది చూపు కోల్పోయారు. ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణా సంస్థలు మొదటి దశ డ్రైవ్‌లో భాగంగా 76 ఫార్మా సంస్థల్లో తనిఖీలు నిర్వహించాయి.

ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామి

చెన్నై : ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శిగా ఇడప్పడి పళనిస్వామి (ఇపిఎస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని మంగళవారం పార్టీ ఎన్నికల కమిషనర్లు పొల్లాచ్చి వి.జయరామన్, నాథమ్ ఆర్. విశ్వనాథన్ ప్రకటించారు. ఇపిఎస్‌కు నియమాక పత్రాన్ని అందజేశారు. గత ఏడాది జులై 11న ఎఐఎడిఎంకె జనరల్ కౌన్సిల్ సమావేశంలో తనను పార్టీ నుంచి బహిష్కరించడం, ద్వంద్వ నాయకత్వాన్ని రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఒ పన్నీర్ సెల్వం (ఒపిఎస్), ఆయన మద్దతుదారులు దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తిరస్కరిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది. ఆ తరువాత నిమిషాల వ్యవధిలోనే ఇపిఎస్ ఎన్నిక విషయాన్ని పార్టీ ప్రకటించడం విశేషం.

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ

కాంపిటెంట్ అధికారి (భూసేకరణ), జాతీయ రహదారి-16, మరియు సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము, బాపట్ల జిల్లా

ఆర్.సి.నెం./బి5/5356/2022 తేది : 25-03-2023

జాతీయ రహదారుల చట్టము 1956 సెక్షన్ 3జి(3) మరియు (4) క్రింద జారీ చేసిన బహిరంగ నోటీసు

జాతీయ రహదారుల చట్టము 1956 సెక్షన్ 3(డి) 1 క్రింద భారత ప్రభుత్వం రాజ పత్రము నెం.1092 తేది.10.03.2023 న ప్రకటించిన నోటిఫికేషన్‌లో ప్రచురించబడిన ఎస్.ఒ.నెం.1139(ఇ) తేది : 10.03.2023 ననుసరించి బాపట్ల జిల్లాలో జాతీయ రహదారి నెంబరు 16 విస్తరణ మరియు భూమి యొక్క నిర్మాణం అత్యవసర ల్యాండింగ్, వెడల్పు చేయుట మొదలగు వాటి నిర్వహణ నిమిత్తము ఈ క్రింది షెడ్యూలులో చూపబడిన భూములపై ఆసక్తిగల యజమానులు స్వయముగా గాని లేక ఏజెంటు ద్వారా గాని, లేక వకీలు ద్వారా గాని, సదరు భూములకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు మరియు జిరాక్సు కాపీలతో **గ్రామ సచివాలయం, పిచుకలగుడిపాడు వారి కార్యాలయంలో తేది.11.04.2023** న కాంపిటెంట్ అధికారి (భూసేకరణ), జాతీయ రహదారి-16 మరియు సంయుక్త కలెక్టరు, బాపట్ల జిల్లా వారి ఎదుట, కార్యాలయపు పని వేళలలో హాజరై ఆయా భూములపై వారి హితములు తెలుపుకొనవలసినదిగా కోరడమైనది.

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలోని భూమి కి.మీ. 1212+115 వద్ద కి.మీ. 1210.000 నుండి 1215+000 వరకు (చిలకలూరిపేట - నెల్లూరు సెక్షన్) విస్తరించి వున్న ప్రతిపాదిత పరిధిలోని జాతీయ రహదారి-16 కట్టడంతో లేదా లేకుండా అత్యవసర ల్యాండింగ్, వెడల్పు చేయుట మొదలగు వాటి నిర్వహణ నిమిత్తము సేకరించబడే భూమి సంక్షిప్త వివరణ.

రాష్ట్రం : ఆంధ్రప్రదేశ్ జిల్లా : బాపట్ల

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూమి తరహా	భూమి స్వభావం	స్థలం (ఎ॥సెంట్లు)	స్థలం (హెక్టార్లు)	స్థలం (చ॥మీ)	భూమి యాజమాని / అనుభవదారు పేరు
1	2	3	4	5	6	7	8
మండలం : కొరిశపాడు							గ్రామం : పిచుకలగుడిపాడు
1	132/1	ప్రైవేట్	మెట్ట	0.01	0.0040469	40.47	కొట్టే వెంకటరత్నం భర్త : రామారావు
2	132/1	ప్రైవేట్	మెట్ట	0.10	0.0404694	404.70	కొట్టే రంజిత్ కుమార్ తండ్రి : హనుమంతరావు
3	90	ప్రైవేట్	మెట్ట	0.02	0.0080939	80.94	అలవల సుబ్బారెడ్డి తండ్రి : పున్నారెడ్డి
4	92	ప్రైవేట్	మెట్ట	0.08	0.0323756	323.76	కొట్టే రంజిత్ కుమార్ తండ్రి : హనుమంతరావు
5	92	ప్రైవేట్	మెట్ట	0.04	0.0161878	161.88	కొట్టే వెంకటరత్నం భర్త : రామారావు
6	93	ప్రైవేట్	మెట్ట	0.05	0.0202347	202.35	కొట్టే రంజిత్ కుమార్ తండ్రి : హనుమంతరావు
7	93	ప్రైవేట్	మెట్ట	0.24	0.0971267	971.28	కొట్టే వెంకట నారాయణ తండ్రి : నరసింహారావు
8	93	ప్రైవేట్	మెట్ట	0.13	0.0526103	526.11	కొట్టే వెంకటరత్నం భర్త : రామారావు
9	93	ప్రైవేట్	మెట్ట	0.355	0.1436665	1436.685	అలవల సుబ్బారెడ్డి తండ్రి : పున్నారెడ్డి
10	93	ప్రైవేట్	మెట్ట	0.215	0.0870093	870.105	అలవల రవీంద్రారెడ్డి తండ్రి : అంజిరెడ్డి
11	94/2	ప్రైవేట్	మెట్ట	0.08	0.0323756	323.76	అలవల సుబ్బారెడ్డి తండ్రి : పున్నారెడ్డి
12	94/2	ప్రైవేట్	మెట్ట	0.07	0.0283286	283.29	అలవల రవీంద్రారెడ్డి తండ్రి : అంజిరెడ్డి
			మొత్తం	1.39	0.5625253	5625.33	

సం/- సంయుక్త కలెక్టర్ మరియు కాంపిటెంట్ అధికారి (భూసేకరణ)
బాపట్ల జిల్లా.





మీకోసం

పెసరపిండిలో నిమ్మరసం కలిపి వెండిగిన్నెలు తోమితే తళతళ మెరుస్తాయి.

జీవన సౌరభం

అన్నీ కోల్పోయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు. అదొక్కటి ఉంటే మనం కోల్పోయిన వాటన్నింటినీ తిరిగి సంపాదించుకోవచ్చు.

లేత గులాబీలం



కన్నవారి కనుపాపలం
బంధువులకు బాంధవ్యులం
గురువులకు శిష్యులం
భరతమాతకు ప్రియపుత్రులం!

విరిసి విరియని మొగ్గలం
అభం శుభమెరుగని సహృదయులం
కల్మషమెరుగని స్వచ్ఛ మనస్కులం
చాచాజీ హృదయ నేస్తాలం!


చదువులు చక్కగా చదివెదం
ఆటలు బాగా ఆడెదం
అలుపెరగక శ్రమించెదం
అందరి మెప్పులు పొందేదం!

పెద్దల మాటలు వినెదము
మారాం చేయడం మానెదము
సత్యమునే నిత్యము పలికెదము
మాతృభాషలోనే మాట్లాడెదము!

అరవిరిసిన లేత గులాబీలం
ర్యాంకుల ముళ్లల్లో చిక్కిన చిన్నారులం
అమూల్య బాల్యస్మృతులను కోల్పోతున్న వారం
కోల్పోతున్న వాటిని అందించమని
వేడుకుంటున్నాం!

– ఆళ్ల నాగేశ్వరరావు
74166 38823

ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ



చల్లా తేజస్విన్, 3వ తరగతి,
వివేకానంద హైస్కూలు,
పాలకొండ, పార్వతీపురం,
మన్యం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అనుకోకుండా చూసి.. ఆ శైలిలో ఎన్నో చిత్రాలు గీసి...

ఆమె పోలీసు అధికారిగా పెద్ద బాధ్యతలో ఉన్నారు. నిత్యం కేసులు, దర్యాప్తులు, అధికారుల ఒత్తిళ్లు ఉంటాయి. క్షణం తీరిక ఉండదు. కుటుంబ సభ్యులతో సమయం కేటాయించలేరు. నిత్యం హడావుడి జీవితం. అయినా సీమా అలవా మహిళా పోలీసు అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, పిథోరా శైలి పెయింటింగ్‌పై దృష్టి పెట్టారు. ప్రాచీన కళలు, సామాజిక ఇతివృత్తాలను, ప్రకృతి అందాలను తన పెయింటింగ్‌లో చొప్పిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.



మధ్యప్రదేశ్, ధార్ జిల్లాకు చెందిన సీమా బాల్యం మొత్తం గిరిజన కుటుంబాల మధ్య గడిపింది. వారి జీవన స్థితిగతులు, రోజూ వారు ఎదుర్కొనే సమస్యలు ఆమెకు అవగాహన ఉంది. ఇంటికి దగ్గర్లో చాలామంది కళాకారులు పెయింటింగ్ వేస్తూ ఉండేవారు. దాంతో పెయింగ్ నేర్చుకోవాలని మనసులో ఉన్నా సమయం కేటాయించలేదు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆమె పై చదువుల నిమిత్తం ఢిల్లీకి వెళ్లింది. పోలీస్ అకాడమీలో శిక్షణ తీసుకుని, 25 ఏళ్ల క్రితం స్టేట్ పోలీస్ సర్వీస్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఎన్నో నేరాల కేసులను చేధిస్తూ పై అధికారులు అభినందనలు అందుకున్నారు. మహిళల అక్రమ రవాణా, హత్యలు సంబంధిత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేరస్తులకు శిక్ష పడేలా చేశారు. ఇలా ఉరుకులు, పరుగులతో కొన్నేళ్లు సాగాయి.

కళల పట్ల ఆసక్తి

ఎనిమిదేళ్ల క్రితం సీమా ఝబువా జిల్లా అదనపు ఎస్పీగా నియమితులయ్యారు. ఓ రోజు ట్రిపుల్ మర్డర్ కేసు దర్యాప్తు చేస్తున్నప్పుడు పిథోరా శైలి పెయింటింగ్‌ను చూశారు. మనసుకు ఎంతగానో నచ్చింది. తానూ పెయింటింగ్ వేయాలన్న ఆశ కలిగింది. అప్పటి నుంచి ఈ కళపై దృష్టిపెట్టారు. ఓ వైపు డ్యూటీ చేస్తూనే రోజు కొంత సమయం పెయింటింగ్‌కు కేటాయించి శిక్షణ తీసుకున్నారు. ఆ ప్రాంతంలో ప్రాచీన కళలు అయిన గోండ్, వార్లీ కళలతో పాటు ఇతన జానపద శైలులతో పెయింటింగ్ చేయడం నేర్చుకున్నారు. నేర్చుకున్న కొన్ని నెలలకే ఆమె సృజనాత్మకంగా వేసిన పెయింటింగ్స్ చూపరుల హృదయాలను దోచుకున్నాయి. వాటిలో గిరిజనుల జీవితాలు, బాల కార్మికులు, బాల్య వివాహాలు, పిల్లలకు విద్య వంటి అంశాలను వివరిస్తూ వేసిన పెయింటింగ్స్ ఎందరినో ఆకట్టుకున్నాయి. సోషల్ మీడియాలో ఈ పెయింటింగ్‌లకు లక్షల వ్యూస్, లైక్‌లు వచ్చాయి. నర్మదాను వర్ణించే ఓంకారేశ్వరాలయం పెయింటింగ్ అద్భుతంగా గీశారు. అధికారుల ప్రశంసలూ అందుకున్నారు.







ఇప్పటి వరకూ ఆమె 180 యాక్రిలిక్ పెయింటింగ్‌లు వేశారు. వాటిలో సందేశాత్మక అంశాలు చాలా ఉన్నాయి. అందుకే అధికారులు సైతం వాటిని ఇష్టంగా తీసుకుంటున్నారు. వీటిలో కొన్నింటిని ఝబువా, అలిరాజ్‌పూర్, ఖాండ్వా, బేతుల్ జిల్లాల్లో కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయాల్లో గోడలకు అందంగా అలంకరించారు. రాజ్ భవన్, భోపాల్లో సెంట్రల్ అకాడమీ ఆఫ్ పోలీస్ ట్రైనింగ్, దోహాలోని భారత రాయబార కార్యాలయం, ఇంగ్లాండ్‌లోని సెస్టర్ పట్టణంలో ప్రముఖ హోటళ్లలోనూ ఆమె పెయింటింగ్‌కు ఆదరణ లభించింది.

ఇటీవల, ఖాండ్వాలో 'ఎసెన్స్ ఆఫ్ ఫోక్ ఆర్ట్' పేరుతో జరిగిన ఎగ్జిబిషన్‌లో, హనువంతియాలో గ్రూప్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఆమె పెయింటింగ్స్ చూసి అధికారులు మెచ్చుకున్నారు. వీటి మీద వచ్చిన ఆదాయాన్ని ఇండోర్‌లోని జ్వాలా ఎన్‌జిఓకు సీమా అందిస్తున్నారు. 'రోజంతా శవాలు, హత్యలు, రక్తం, నేరాగాళ్లు, స్టేషన్స్, జైలు, కోర్టులంటూ తిరుగుతా. కాని ఇంటికి వచ్చాక బ్రష్ పట్టుకుని పెయింటింగ్ వేస్తే ఆ ఒత్తిడి అంతా పోతుంది. మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది' అంటారు సీమా.

నోటి దుర్వాసన నుంచి ఉపశమనం ఇలా ...

నోటి దుర్వాసన వల్ల చాలామంది ఇతరులతో సరిగ్గా మాట్లాడలేరు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే కొన్ని రకాల జాగ్రత్తలను పాటిస్తే సరి.. అయితే అసలు నోటి దుర్వాసనకు గల కారణాలేంటి.. దాని నివారణకు మార్గాలేంటో చూద్దాం.

- దంతాలు ఇంకా నోటిని సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం వల్ల కూడా నోటి దుర్వాసన తలెత్తే అవకాశం ఉంది.
- తరచూ నోరు పొడిబారడం, చిగుళ్ల సమస్యలు, దంతాల్లో క్యావిటీ, ఉల్లి, వెల్లుల్లి ఎక్కువగా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసన సమస్య ఎక్కువగా ఏర్పడుతుంది.
- పళ్ల మధ్య ఆహారం ఇరుక్కుపోవడం, నాలుకపై పేరుకోవడం, డయాబెటిస్ ఇంకా అలాగే సల్ఫర్ అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణం అవుతుంది.
- ధూమపానం, మద్యం, ఒత్తిడి, ఆందోళనలు కూడా నోటి దుర్వాసనకు ప్రధాన కారణాలు.



ఉపశమనం పొందండి ఇలా ...

- నోటి దుర్వాసనతో ఇబ్బంది పడేవారు ఎక్కువగా నీరు తాగడం వల్ల ఆ సమస్య నుంచి బయటపడవచ్చునని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.
- నోరు పొడిగా అనిపించినప్పుడు నీటిని తాగడం వల్ల, నోట్లో చెడు బ్యాక్టీరియా పెరగకుండా ఉంటుంది. ఇక లాలాజలం నోటిని శుభ్రంగా ఉంచడంలో చాలా బాగా సహాయపడుతుంది. దుర్వాసన కలిగించే బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా నిరోధిస్తుంది.
- అలాగే నిమ్మరసంతో బ్రష్ చేయడం వల్ల దుర్వాసన చాలా సులభంగా తగ్గించుకోవచ్చు.
- రోజులో రెండు సార్లు బ్రష్ చేయడాన్ని తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి.
- టూత్ బ్రష్‌లను రెండు మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా మారుస్తూ ఉండాలి. చెడు వాసనకు కారణమైన బ్యాక్టీరియాను తరిమేందుకు సహజసిద్ధమైన మౌత్ వాష్‌లను వినియోగించాలి.
- నోటి దుర్వాసన పంటి సమస్యల వల్ల కూడా వస్తుంటుంది. అందుకే వీలైనంత వరకు నోటిని, పళ్లను చాలా శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలి.
- ప్రతి రోజూ ఉదయం బ్రష్ చేసిన తరువాత తప్పనిసరిగా ఉప్పు నీటితో నోటిని పుక్కిలించుకోవాలి. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో కళ్లుప్పుని వేసుకుని కలిపి.. దానిని రోజులో రెండు మూడు సార్లైనా పుక్కిలించాలి.
- ఆహారం తీసుకున్న తరువాత ఇలా చేయడం వల్ల నోట్లో ఏదైనా ఆహారం మిగిలిపోయి ఉంటే నోరు చాలా శుభ్రం అవుతుంది.

విద్వేష ప్రసంగాలను తిరస్కరిస్తేనే మత సామరస్యం



న్యూఢిల్లీ : దేశంలో మత సామరస్యతను కొనసాగించాలంటే విద్వేష ప్రసంగాలను తిరస్కరించడమే ప్రాథమిక ఆవశ్యకత అని సుప్రీం కోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. విద్వేష ప్రసంగాలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్య చేసింది. విద్వేష ప్రసంగాల సమస్యను పరిష్కరించాలంటే కేవలం ఫిర్యాదులను నమోదు చేస్తే సరిపోదని, అందువల్ల ఎఫ్‌ఐఆర్‌ల నమోదును అనుసరించి తీసుకుంటున్న చర్యలేంటని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు కోరింది. విద్వేష ప్రసంగాలకు సంబంధించి ఇప్పటివరకు 18 ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేశామని మెహతా కోర్టుకు తెలియజేశారు. మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా ఈ అంశంపై విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. భారతదేశం లౌకికవాద దేశమని రాజ్యాంగం పేర్కొంటోందంటూ, విద్వేష ప్రసంగాల కేసులపై కఠినంగా వ్యవహరించాల్సిందిగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలను గతేడాది అక్టోబరు 21న సుప్రీం ఆదేశించింది. ఫిర్యాదు నమోదు కోసం వేచి వుండకుండా దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరింది. ఇంతటి తీవ్రమైన అంశంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో ఏ మాత్రం జాప్యం జరిగినా కోర్టు ధిక్కార చర్యలను ఆహ్వానించినట్లే కాగలదని హెచ్చరించింది.

మనీ లాండరింగ్ యాక్ట్‌లో 50, 63 సెక్షన్ల సవాలుపై మీ వైఖరేంటి ?

- కేంద్రాన్ని కోరిన సుప్రీం

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ)లోని 50, 63 సెక్షన్లను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరుతూ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత గోవింద్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాల్సిందిగా సుప్రీం కోర్టు మంగళవారం కేంద్రాన్ని కోరింది. నిందితుడిని పిలిపించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయడానికి సెక్షన్ 50, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు అధికారం కల్పిస్తోంది. ఈ స్టేట్‌మెంట్ కోర్టులో సాక్ష్యంగా ఆమోదయోగ్యమైనది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని బెంచ్ ముందు గోవింద్ సింగ్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, తన క్లయింట్‌కు ఇడి సమన్లు పంపడాన్ని సవాలు చేశారు. స్వీయ నేరారోపణకు వ్యతిరేకంగా ప్రాథమిక హక్కును సెక్షన్ 50 ఉల్లంఘించిందని అన్నారు. సెక్షన్ 50కింద చేపట్టే కార్యకలాపాలను దర్యాప్తులో భాగంగానే పరిగణించాలన్నారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, రాజ్యాంగం కింద కల్పించే రక్షణలు నిందితునికి అందుబాటులో వుండాలన్నారు. ఽ ఈ కేసు విచారణను ఆరు వారాల తర్వాతకి బెంచ్ వాయిదా వేసింది. ఏ వ్యక్తినైనా పిలిపించి, పిఎంఎల్‌ఎ చట్టంలోని 50వ సెక్షన్ కింద స్టేట్‌మెంట్‌ను నమోదు చేయడానికి ఇడి అధికారిని పిఎంఎల్‌ఎ నిబంధనలు అనుమతిస్తాయని, అలాంటి స్టేట్‌మెంట్‌లలో వాస్తవమే మాట్లాడాలని కోరడం రాజ్యాంగంలోని 20(3), 21 అధికరణలను ఉల్లంఘించడమేనన్న సూత్రం ఆధారంగా సవాలు చేస్తున్నామని న్యాయవాది సుమీర్ శోధి తెలిపారు. విజయ్ మదన్‌లాల్ చౌదరి వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీం తీర్పు గురించి పిటిషనర్‌కి తెలుసునని ఆ పిటిషన్ పేర్కొంది. సమన్లు జారీ చేసి, అరెస్టు చేసే విస్తృత అధికారం ఇడికి ఇస్తూ పిఎంఎల్‌ఎకి చేసిన సవరణలను సుప్రీం సమర్ధించింది.
ఇసిఐఆర్ కాపీని పిటిషనర్‌కి ఇవ్వలేదని, లేదా వివరాలు కూడా తెలియజేయలేదని, అందువల్ల దర్యాప్తు పరిధి గురించి పిటిషనర్‌కి పూర్తిగా తెలియదని ఆ పిటిషన్ పేర్కొంది. ఇడి, సిబిఐ తమ నేతలను విచక్షణారహితంగా అరెస్టు చేయడం, దాడులు నిర్వహించడం, సమన్లు జారీ చేయడం వంటి వాటిని నిరసిస్తూ 14 ప్రతిపక్ష పార్టీలు సుప్రీం కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో ఈ పిటిషన్ వేశారు.

త్వరలో బంగ్లా ఖాళీ చేస్తా

- అధికారులకు రాహుల్ లేఖ

న్యూఢిల్లీ : త్వరలో తన బంగ్లాను ఖాళీ చేస్తానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తెలిపారు. అధికారుల ఆదేశాలను తాను తప్పకుండా పాటిస్తానని పేర్కొంటూ లోక్‌సభ సెక్రటేరియట్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడటంతో రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఇటీవల లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. నిబంధనల ప్రకారం.. నెల రోజుల్లోపు అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే 12– తుగ్లక్‌లేన్‌లోని అధికార బంగ్లాను ఏప్రిల్ 22లోగా ఖాళీ చేయాలంటూ రాహుల్‌కు లోక్‌సభ సెక్రటేరియట్ సోమవారం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ లేఖపై రాహుల్ స్పందించారు. 12– తుగ్లక్‌లేన్‌లోని తన నివాసాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ పంపిన లేఖ అందిందని, అందుకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. ప్రజల తీర్పుతో నాలుగు సార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన తాను ఈ బంగ్లాలో ఉన్నానని, ఇక్కడ తనకు చాలా సంతోషకరమైన జ్ఞాపకాలున్నాయని తెలిపారు. తన హక్కులకు భంగం కలగకుండా.. లేఖలో పేర్కొన్న విధంగా వ్యవహరించడానికి సిద్ధంగానే ఉన్నానని, అది తన బాధ్యత అని, త్వరలో బంగ్లాను ఖాళీ చేస్తానని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు.

ఏ ప్రాథమిక హక్కు ఉల్లంఘనకు గురైంది ?

- లక్షద్వీప్ ఎంపిని ప్రశ్నించిన సుప్రీం


న్యూఢిల్లీ : ఏ ప్రాథమిక హక్కు ఉల్లంఘనకు గురైందో తెలియజేయాల్సిందిగా లక్షద్వీప్ ఎంపి ఫైజల్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కోరింది. ఆర్టికల్ 32 పిటిషన్ దాఖలు చేయడాన్ని ప్రశ్నించింది. ప్రాథమిక హక్కు ఉల్లంఘనకు గురైతే రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద రిట్ పిటిషన్లను దాఖలు చేస్తారు. హత్యాయత్నం కేసులో తన నేరారోపణను రద్దు చేసినప్పటికీ తన లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధ రించబడలేదని పేర్కొంటూ ఫైజల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్నలతో కూడిన బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించింది. ఇక్కడ ప్రాథమిక హక్కు అంటే ఏమిటి? అని జస్టిస్ జోసెఫ్ ఫైజల్ తరపు న్యాయవాదిని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో తన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడమని న్యాయవాది చెప్పగా, అది ప్రాథమిక హక్కా?

226వ అధికరణ కింద మీరు హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదు? అని ప్రశ్నించారు. బుధవారానికి కేసు విచార ణను వాయిదా వేశారు. కేరళ హైకోర్టు తన నేరారోపణపై జనవరి 25న స్టే విధించినప్పటికీ లోక్‌సభ సచివాలయం తన అనర్హతా నోటిఫికేషన్‌ను ఉపసంహరించలేదని ఫైజల్ తన పిటిషన్‌లో కోర్టుకు తెలియజేశారు.

ధోని ప్రాక్టీస్ షురూ!

బ్యాటర్‌గానే బెన్ స్టోక్స్ సేవలు.. బట్లర్ రాకతో రాజస్తాన్ ఖుషీ..





చెన్నై: ఇండియన్ ప్రిమియర్ లీగ్(2023) మరో రెండురోజుల్లో ప్రారంభం కానుంది. ఈ క్రమంలో విదేశీ ఆటగాళ్లు లీగ్‌లో ఆడేందుకు ఒక్కొక్కరుగా ఆయా ఫ్రాంచైజీలకు చేరుకుంటుండగా.. చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ జట్టు ఆటగాళ్లతో జతకట్టాడు. అలాగే మంగళవారం కొంతసేపు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. ధోనీ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలను ఆ ఫ్రాంచైజీ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. వికెట్ కీపర్, బ్యాటర్‌గా అయిన ధోనీ గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. దీంతో ఐపిఎల్‌కు గుడ్‌బై పలకడమే తరువాయి అనుకున్న తరుణంలో ధోనీ మళ్లీ బ్యాట్ పట్టి మైదానంలోకి దిగడం గమనార్హం. ఇక చెన్నై జట్టు తన లీగ్ మ్యాచ్‌ను మార్చి 31న డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో చపాక్ స్టేడియంలో తలపడనుంది. 41ఏళ్ల ధోనీ ఈ సీజన్ ఐపిఎల్‌లో ఏ మేరకు రాణిస్తాడో వేచిచూడాల్సి ఉంది.

చెన్నైకు ఎదురుదెబ్బ..

మరికొద్ది రోజుల్లో ఐపీఎల్ 2023 సీజన్ ప్రారంభంకానుండగా ఆ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ మోకాలి సమస్యతో బాధపడుతుండడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో స్టోక్స్.. ఐపిఎల్ 16వ ఎడిషన్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు కేవలం బ్యాటర్‌గానే సేవలందిస్తాడని, ఆ జట్టు బ్యాటింగ్ కోచ్ మైక్ హస్సీ మంగళవారం ప్రకటించారు. స్టోక్స్ గాయంనుంచి పూర్తిగా కోలుకుంటే బౌలర్‌గా సేవలందిస్తాడని హస్సీ పేర్కొన్నాడు. బెన్ స్టోక్స్‌ను చెన్నై రూ. 16.25 కోట్ల రికార్డు ధరకు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

బట్లర్ చేరికతో రాజస్తాన్ ఖుషీ..

ఇంగ్లండ్ వన్డే జట్టు కెప్టెన్ జోస్ బట్లర్ భారత్ చేరుకున్నాడు. అతడు ఇండియాకు వచ్చిన వీడియోను రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది. ఆ వీడియోలో బట్లర్.. 'యుజీ(యజువేంద్ర చాహల్) ఎక్కడ?' అని అంటాడు. 15వ సీజన్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన బట్లర్ విధ్వంసక ఇన్నింగ్స్‌లతో రాజస్థాన్‌ను ఎన్నో మ్యాచుల్లో గెలిపించాడు. 17మ్యాచుల్లో 863పరుగులు చేసి ఆ ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. ఆ సీజన్‌లో బట్లర్ నాలుగు సెంచరీలు, నాలుగు అర్ధ శతకాలు బాదాడు. 149.05 స్ట్రయిక్ రేటుతో రాజస్తాన్ జట్టు ఫైనల్ చేరడంలో బట్లర్ కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో రాజస్తాన్ జట్టు ఫైనల్లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

శ్రీలంక ప్రపంచకప్ ఆశలు గల్లంతు

వర్షంతో కివీస్‌తో రెండో వన్డే రద్దు..

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరగాల్సిన రెండో వన్డే వర్షం కారణంగా రద్దు కావడంతో శ్రీలంక వన్డే ప్రపంచకప్ ఆశలు అడియాశలయ్యాయి. భారత్ వేదికగా ఈ ఏడాది ఆఖర్లో జరిగే వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక జట్టు నేరుగా బెర్త్ దక్కించుకోవాలంటే న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌ను గెలుపొందాల్సి ఉంది. ఈ క్రమంలో శ్రీలంక జట్టు తొలి వన్డేలో 198పరుగుల తేడాతో ఓటమిపాలుకాగా.. మంగళవారం న్యూజిలాండ్‌తో జరగాల్సిన రెండో వన్డే వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో శ్రీలంక జట్టు వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించలేకపోయింది. ఐసిసి వన్డే టాప్–8 ర్యాంకుల్లో ఉన్నట్లు జట్లు నేరుగా అర్హత సాధిస్తాయి. మిగిలిన రెండు స్థానాల కోసం టోర్నీకి ముందు అర్హత పోటీ జరగనుంది. శ్రీలంక జట్టు స్థానంలో వెస్టిండీస్ జట్టు ఎనిమిదో స్థానంలో నిలువగా.. శ్రీలంక తొమ్మిదో స్థానంలో ఉన్నాయి. 1996లో వన్డే ప్రపంచకప్ టైటిల్‌ను గెలిచిన శ్రీలంక.. 2011లో రన్నరప్‌గా నిలిచింది. **వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించిన జట్లు**

(1) న్యూజిలాండ్ (2) ఇంగ్లండ్ (3) భారత్ (4) బంగ్లాదేశ్ (5) పాకిస్థాన్ (6) ఆస్ట్రేలియా (7) అఫ్గనిస్థాన్ (8) వెస్టిండీస్

టాప్-10లో చోటు కోల్పోయిన సింధు

సాత్విక్–చిరాగ్ జోడీకి 6వ ర్యాంక్

లాసన్నె: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో పివి సింధు టాప్–10లో చోటు దక్కించుకోలేకపోయింది. గత వారం జరిగిన స్విస్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సింధు.. రెండోరౌండ్‌లోనే నిష్క్రమించింది. దీంతో సింధు తాజా ర్యాంకింగ్స్‌లో 11వ స్థానానికే పరిమితమైంది. సింధు ఖాతాలో 60,448పాయింట్లే ఉన్నాయి. ఇక పురుషుల డబుల్స్‌లో స్విస్ ఓపెన్ డబుల్స్ టైటిల్ నెగ్గిన సాత్విక–చిరాగ్ శెట్టి జోడీ 6 ర్యాంక్‌కు ఎగబాకగా.. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ 6వ స్థానం, కిదాంబి శ్రీకాంత్ 21వ స్థానం, లక్ష్యసేన్ 25వ స్థానాల్లో నిలిచారు. ఇక మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ–గాయత్రీ జంట 18వ స్థానానికి ఎగబాకారు.

ఎంఆర్ అర్జున్–ధృవ్ కపిల శుభారంభం..

స్విస్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్–ధృవ్ కపిల జోడీ 16–21, 21–17, 21–12తో స్కాట్లాండ్‌కు చెందిన ఎం.గ్రిమ్లే–సి.గ్రిమ్లే జోడీని చిత్తుచేసింది.

మెరిసిన సందేశ్, ఛెత్రీ

కిర్గిజిస్థాన్‌పై 2–0గోల్స్‌తో గెలుపు



ఇంఫాల్ (మణిపూర్): మూడు దేశాల అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు ఘన విజయం సాధించింది. మంగళవారం కిర్గిజిస్థాన్‌తో తలపడిన భారత జట్టు 2–0గోల్స్ తేడాతో గెలిచింది. తొలి అర్ధభాగం 34వ ని.లో బ్రాండాన్ కొట్టి ఫ్రి కిక్‌ను సందేశ్ జింఘాన్ గోల్‌గా మలిచాడు. దీంతో భారతజట్టు తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 1–0 ఆధిక్యతలో నిలిచింది. ఇక రెండో అర్ధభాగం 84వ ని.లో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించగా.. దానిని కెప్టెన్ సునీల్ ఛెత్రీ గోల్‌గా మలిచాడు. ఇంఫాల్‌లోని ఖుమాన్ లంపాక్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరిగిన ఈ మ్యాచ్‌ను అత్యధికసంఖ్యలో అభిమానులు ప్రత్యక్షంగా వీక్షించారు. భారత జట్టు తదుపరి మ్యాచ్‌ను మయన్మార్‌తో తలడపనుంది. అంతకుముందు మయన్మార్‌తో జరిగిన తొలి మ్యాచ్‌ను కిర్గిజిస్థాన్ 1–1తో డ్రా చేసుకోవడంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరాలంటే చివరి మ్యాచ్‌లో తప్పక గెలవాల్సి ఉంది. ఇక భారత జట్టు ఫైనల్‌కు చేరాలంటే మయన్మార్‌తో చివరి మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా సరిపోతుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68